# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LGTV

LOCAL NEWS GOBAL FOCUS

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 15, | సంచిక 256, | పేజీలు -12 | శుక్రవారం - 17 - జూలై - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094


## ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

కీలక మిషన్ల శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్రం కఠిన నిర్ణయం

శాస్త్రవేత్తల రాజీనామాలు ఇక సాధారణంగా ఆమోదించ వద్దని ఆదేశం

తుది నిర్ణయం అంతరిక్ష శాఖే తీసుకోనుందంటూ అంతర్గత మెమో




ఢిల్లీ,: ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలో ఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం..

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం.. కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్

సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో ఘటన

ఇస్లామిక్ సూక్తులు నేర్చుకోవాలంటూ హిందూ విద్యార్థికి హోంవర్క్

డైరీని గమనించి షాక్ కు గురైన తల్లిదండ్రులు




స్కూలు గుర్తింపు రద్దు చేయాలన్న రాంచందర్ రావు

హైదరాబాద్, : హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి 'సక్సెస్ స్కూల్'లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్-ఫాతిహా' చదివి,

## హర్మూజ్ జలసంధికి వెళ్లొద్దు.. భారత నావికులపై కేంద్రం ఆంక్షలు




హర్మూజ్ జలసంధి గుండా భారత నావికులను పంపవద్దని ఆదేశాలు

నౌకల యజమానులకు, మేనేజర్లకు డీజీఎంఏ ఉత్తర్వుల జారీ

ఢిల్లీ,:గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల్లో భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ




## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం




హైదరాబాద్, : ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# కేసీఆర్ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేశారు.. మంత్రి ఉత్తమ్ ధ్వజం

- కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలింది
- మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు
- బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారు
- సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు
- గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోంది



భద్రాద్రి కొత్తగూడెం, : కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

ఢిల్లీ,:పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం







## మేం వచ్చాక స్కూళ్లలో హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

## 100 కేసులు పెట్టినా భయపడను.. ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా




ప్రభుత్వం తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందన్న అంబటి

ముద్రగడ బతికున్నప్పుడు ఆయనను చిత్రహింసలకు గురిచేశారని మండిపాటు

ప్రభుత్వంపై కాపు సామాజికవర్గంలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని వ్యాఖ్య

అమరావతి,: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై తనపై కేసు నమోదు కావడం పట్ల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని

## రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్




పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సత్యకుమార్, పురందేశ్వరి, మాధవ్ తదితరులు

- పోలవరం కోసం మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం రెడీగా ఉందన్న సత్యకుమార్
- పోలవరంను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న మాధవ్

# 'జగన్ 2.0 సూపర్ యాప్' ఆవిష్కరణ

- పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలు కోసం యాప్ డిజైన్ చేశారు
- ఈ యాప్ వల్ల ప్రతి కార్యకర్త నిత్యం, పార్టీ నాయకత్వంతో అనుసంధానమై ఉంటాడు"
- ఇది ఒక మంచి పరిణామం. ఇష్టం వచ్చినట్లు చేసే కుట్రలు కూడా దీనివల్ల తిప్పి కొట్టొచ్చు.'
- ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో మనమే ఒక యాప్ తీసుకొచ్చి ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం






తాడేపల్లి: పార్టీ కేంద్ర కార్యాలయంలో 'జగన్ 2.0 సూపర్ యాప్'ను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలు కోసం యాప్ డిజైన్ చేశారు. పార్టీ నేతలంతా నేరుగా కార్యకర్తలతో టచ్‌లో ఉండేలా ఈ యాప్‌ను రూపొందించారు. సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నుంచి ఇవాళ అధికారిక 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరిస్తున్నామన్నారు. "ఈ రోజు ఏం జరుగుతోంది అంటే.. సోషల్ మీడియాలో మన వాళ్లు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా డిలీట్ చేయడం, అందుకోసం ఇష్టానుసారం కుట్రలు పన్నడం..

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి




- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం

అమరావతి,: రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి




- పూరీ జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకుని భక్తులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు
- ప్రతి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించిన పవన్
- ప్రతి ఇంటిని సుఖ సంతోషాలతో నింపాలని ఆకాంక్ష

## ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

మొదటి పేజి తరువాయి

జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం.. గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120 మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్-3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసినవారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్-3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం.. కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్

మొదటి పేజి తరువాయి

ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్-ఫాతిహా' చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖితపూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది. ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## హార్మూజ్ జలసంధికి వెళ్లొద్దు.. భారత నావికులపై కేంద్రం ఆంక్షలు

మొదటి పేజి తరువాయి

భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నౌకల యజమానులు, షిప్ మేనేజర్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు (ఆర్‌పీఎస్ఎల్) ఈ నిబంధనను తక్షణమే పాటించాలని సూచించింది. ఈ వివాదాస్పద ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇటీవల మొంబాసా బి, అల్ బహ్యా, జీఎఫ్ఎస్ గెలాక్సీ, ఎంటీ వెద్యాన్, అల్ రెకయ్యాత్ వంటి వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో ప్రయాణించే నావికులు, నౌకలకు ప్రమాదం గణనీయంగా పెరిగిందని తన ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆంక్షలు విధించినట్లు స్పష్టం చేసింది.

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడమే ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం. ఇరాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించడం, ప్రతిగా ఇరాన్ ఒడోవేలపై అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తిరిగి విధించడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. తాము అమెరికాతో జీవన్మరణ పోరాటం చేస్తున్నామని, తమ ప్రాంతంలో ఇంధన ఎగుమతులను అడ్డుకుంటామని హెచ్చరించింది. ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇప్పటికే ఉన్న నౌకలకు సూచనలు

ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి, దాని పరిసర జలాల్లో ఉన్న నౌకల కెప్టెన్లు (మాస్టర్స్) అత్యంత అప్రమత్తంగా ఉండాలని డీజీఎంఏ సూచించింది. భద్రతాపరమైన హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ, అంతర్జాతీయ నౌక, నౌకాశ్రయ భద్రతా నియమావళి (ఐఎస్‌పీఎస్) ప్రకారం రూపొందించిన షిప్ సెక్యూరిటీ ప్లాన్‌ను కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. ఏదైనా అత్యవసర సహాయం అవసరమైతే, వెంటనే డీజీ కమ్యూనికేషన్ సెంటర్ (ఎంఎంఏసీసీ) లేదా భారత నౌకాదళానికి చెందిన ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్-ఇండియన్ ఓషన్ రీజియన్ (ఐఎఫ్‌సీ-ఐఓఆర్) సంప్రదించాలని తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని డీజీఎంఏ భరోసా ఇచ్చింది.

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు



హైదరాబాద్, : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్సీ దాసం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## మేం వచ్చాక స్కూళ్లలో హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

హైదరాబాద్, : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చారన్న వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సంస్కృతిపై బలవంతంగా దాడి చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని ఆదేశించడం దుర్మార్గమని విమర్శించారు. సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్ డైరీలో ఈ హోంవర్క్ రాసినట్లు చెబుతున్నారు. మరోవైపు, కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చిన ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఇలాంటి ఘటన తమ పాఠశాలలో ఇదే తొలిసారి జరిగిందని వివరణ ఇచ్చింది. ఈ ఘటనపై బీజేపీ నేతలు స్కూల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్‌కు వెళ్లే మార్గాలను మూసివేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. తెలంగాణలోని కొన్ని పాఠశాలలు హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని చిన్నారులను ఇస్లాం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వారిని జైలుకు పంపాలని అన్నారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

మొదటి పేజి తరువాయి

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## 100 కేసులు పెట్టినా భయపడను.. ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా

మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను అంబటి రాంబాబు పూర్తిగా సమర్థించుకున్నారు. చనిపోయిన తర్వాత కూడా ముద్రగడ భౌతికకాయం వద్ద రాజకీయం చేయాలని చూశారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముద్రగడ పద్మనాభం బతికున్నప్పుడు ఆయన్ను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని, చనిపోయాక ఇప్పుడు అధికారిక లాంఛనాలు ఇస్తామనడం రాజకీయ కుట్రని అంబటి ఆరోపించారు. "ప్రభుత్వ లాంఛనాలు మాకొద్దు అని ఆయన కుటుంబం ముందే స్పష్టం చేసింది. వాళ్లు వద్దంటున్నా పోలీసులు ఎందుకు వచ్చారు? ముద్రగడ ఆత్మ శాంతించడం కోసమే మేము పోలీసులను అడ్డుకున్నాం. ఇందులో ఎలాంటి తప్పు లేదు" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాష్ట్ర డీజీపీ తనపై ప్రత్యేక నిఘా పెట్టారని అంబటి ఆరోపించారు. రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అమరావతి వెళ్లినప్పుడు, అలాగే రాజమండ్రి జైలు నుంచి బయటకు వస్తున్నప్పుడు కూడా తనపై అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. తనపై వంద కేసులు పెట్టుకున్నా భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. "తాను కాపుల ప్రతినిధిని కానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పుకున్నప్పుడు, ఆయన ఇంకా కూటమిలో ఎందుకు కొనసాగుతున్నారు?" అని అంబటి ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కాపు సామాజికవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

## రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్




అమరావతి,: రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న కరవు రక్కసిని తరిమికొట్టేందుకు గోదావరి జలాల తరలింపే శాశ్వత పరిష్కారమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ భారీ ఆర్థిక మద్దతు ఇస్తోందని ఆయన కొనియాడారు. ఈరోజు జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర సందర్భంగా.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 20,700 కోట్లను విడుదల చేసిందని సత్యకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఈ సందర్శన యాత్ర ద్వారా ప్రాజెక్టులోని లోటుపాట్లను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన 80 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వివరించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రాబోయే పది రోజుల్లోనే నీటిని విడుదల చేస్తామని పీవీఎన్ మాధవ్ ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమను సైతం సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులను శరవేగంగా పరుగులు పెట్టించేందుకు సిద్ధమవుతోంది.

## జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి

అమరావతి,: పవిత్రమైన పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా, శాంతిసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఒక భక్తిపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. పవిత్రమైన ఈ రథయాత్ర అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని.. అది అచంచలమైన విశ్వాసానికి, భక్తికి, అలాగే భగవంతునికి, భక్తుడికి మధ్య ఉండే శాశ్వతమైన ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. పవిత్ర రథాలపై స్వామివారు, అమ్మవారు ముందుకు సాగుతుండగా... ఆ జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిల దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని, ప్రతి కుటుంబానికి మానసిక బలాన్ని, ప్రతి జీవితానికి సరికొత్త ఆశను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ కలియుగ దైవం మనందరినీ ఎల్లప్పుడూ ధర్మమార్గంలో నడిపించి, మన ఇళ్లను సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో నింపాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దీనితో పాటు, సమాజానికి వినమ్రతతో, నిష్కల్మషమైన భక్తితో సేవ చేసేలా.. మనందరికీ అవసరమైన జ్ఞానాన్ని, ధైర్యాన్ని ఆ స్వామి ప్రసాదించాలని కోరారు. ఈ పవిత్రమైన రోజున జగన్నాథుని దివ్య అనుగ్రహం మన జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపి, శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక బలంతో కూడిన ఒక ఉన్నతమైన భవిష్యత్తు వైపు మన సమాజాన్ని నడిపించాలని ఆకాంక్షించారు.

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

మొదటి పేజి తరువాయి

పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టైయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'జగన్ 2.0 సూపర్ యాప్' ఆవిష్కరణ

మొదటి పేజి తరువాయి




సోషల్ మీడియాలో మన వాళ్లు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా డిలీట్ చేయడం, అందుకోసం ఇష్టానుసారం కుట్రలు పన్నడం.. ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో మనమే ఒక యాప్ తీసుకొచ్చి ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం. అదే జగన్ 2.0 సూపర్ యాప్. దీంట్లో ప్రతి కార్యకర్త నిర్భయంగా తన అభిప్రాయం చెప్పొచ్చు. ..అంతే కాకుండా దీని ద్వారా ప్రతి కార్యకర్త పార్టీతో అనుసంధానమై ఉంటాడు. ఇది మన యాప్ కాబట్టి, మన వాళ్లే ఇందులోకి వస్తారు కాబట్టి, ఎవరు పడితే వారు డిలీట్ చేసే హక్కు కూడా వారికి ఉండదు. ఇది ఒక మంచి పరిణామం. ఇష్టం వచ్చినట్లు చేసే కుట్రలు కూడా దీనివల్ల తిప్పి కొట్టొచ్చు." అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఇంకా పార్టీలో ఉన్న చిన్న కార్యకర్త మొదలు, పార్టీ కేంద్ర కార్యాలయం వరకు.. నియోజకవర్గస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడితో, ప్రతి కార్యకర్త అనుసంధానమై ఉంటాడు. ఎందుకంటే పార్టీలో ప్రతి ఒక్కరికి ఇది అందుబాటులో ఉంటుంది కాబట్టి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కానీ, పోలీసుల వేధింపుల వల్ల కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు కానీ, పార్టీకి సంబంధించిన ఏ అంశంపై కానీ, ఈ యాప్ ద్వారా నేరుగా ఒకరితో ఒకరు అనుసంధానమై టచ్‌లో ఉండే అవకాశం ఉంటుంది. ఈ యాప్‌లో మరో మంచి అంశం ఏమిటంటే, పార్టీలో మనం నిర్వహించే ప్రతి సమావేశం, ప్రెస్‌మీట్లు, ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రకటనలు.. అన్నీ కూడా ఈ యాప్‌లో లైవ్ ఫీడ్ ద్వారా ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటుంది. భవిష్యత్తులో ఈ యాప్‌ను ఇంకా అభివృద్ధి చేయడం జరుగుతుంది. కార్యకర్తలు ఎక్కడైనా, ఏమైనా ఇబ్బంది పడుతుంటే వాటిని ఈ యాప్‌లో పోస్ట్ చేయడం, ఆ తర్వాత పార్టీ వాటిపై స్పందించడం, నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఆ కార్యకర్తకు అండగా నిలబడే అవకాశం కూడా ఉంటుంది. ..పోలీసుల వేధింపులతో ఇబ్బంది పడుతున్న మన పార్టీ వారు, ఇంకా రాజకీయ వేధింపులకు కూడా గురవుతున్న వారు ఇప్పుడు డిజిటల్ డైరీలో నమోదు చేస్తున్న వివరాలు.. ఆ డైరీ కూడా ఈ యాప్‌తో అనుసంధానం అవుతుంది. అంటే ఈ యాప్‌లో ఆ డిజిటల్ డైరీ కూడా అందుబాటులోకి వస్తుంది. దాని వల్ల వేధింపుల, సమస్యలు ఎదుర్కొంటున్న వారు నేరుగా ఈ యాప్ ద్వారా డిజిటల్ డైరీలో వాటిని ఫిర్యాదు చేయొచ్చు. ఆ వివరాలు నమోదు చేయొచ్చు. ..ఇతర సోషల్ మీడియా వేదికల్లో మనపై చేస్తున్న అనుచిత విమర్శలు, వీడియోలు, వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసి, వాటిని తొలగింపచేసే ప్రయత్నం ఒకవైపు చేస్తూనే, మరోవైపు ఈ సూపర్‌యాప్‌ను ఎవరూ ఆపలేని విధంగా మనకు మనం సొంతంగా రూపొందించుకోవడం జరిగింది. ఈ యాప్ వల్ల ప్రతి కార్యకర్త నిత్యం, పార్టీ నాయకత్వంతో అనుసంధానమై ఉంటాడు" అని వైఎస్ జగన్ వివరించారు.

## పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి

ఒడిశా: ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

## సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు. ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

## చిట్యాల పట్టణం చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన గంజి సుధాకర్ కు శుభాకాంక్షలు .

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ .చిట్యాల పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన గంజి సుధాకర్ ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంజి సుధాకర్ చేనేత కార్మికుల సంక్షేమం , సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకాంక్షించారు. చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.

## విద్యార్థినికి హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చేయూత

లక్ష రూపాయల చెక్కు అందజేత




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 17 : చదువులో ఎంతో ప్రతిభను ప్రదర్శిస్తూ, ఉన్నత విద్యార్జన కోసం ఫీజు చెల్లించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద విద్యార్థినికి రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూతను అందించి తమ ఉదారత్వాన్ని చాటుకున్నారు. నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఎం.కీర్తి బాసర ట్రిపుల్ ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో ఆమె రూ. 2.10 లక్షల ఫీజు బకాయిలు చెల్లించే స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సదరు విద్యార్థినికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లక్ష రూపాయల చెక్కును ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రమణ్ రెడ్డి, మహేష్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి యజమాన్యం వాస్తవ లాభాలు ప్రకటించకుండా ఆర్థిక సంవత్సరం




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)సింగరేణి యజమాన్యం వాస్తవ లాభాలు ప్రకటించకుండా ఆర్థిక సంవత్సరం ముగిసి నెలలు గడుస్తున్నందున కార్మికులు ఆందోళన చెందుతున్నారని టి ఎన్ టి యు సి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.వారు మాట్లాడుతు సింగరేణి కాలరీస్ సమస్త ప్రగతికి కార్మికులు పునాదులుగా నిలుస్తున్నారని,సింగరేణి ఉద్యోగులు సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి 2025,26 ఆర్థిక సంవత్సరానికి 60మిలియన్ టన్నులు నిర్ణయించగా 58మిలియన్ టన్నులు ఉత్పత్తి సాధించారని,ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి కార్మికులకు లాభాల వాటాపై తక్షణమే 40శాతం లాభాల్లో భాగస్వామ్య వాటాను సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాల వాటను ప్రకటించి చెల్లించే తేదీని ఖరారు చేయాలని,కాంట్రాక్ట్ కార్మికులకు గత సంవత్సరం 5వేల రూపాయలు చెల్లించారని లాభాల్లో వాటాను వారికి కూడా 10వేల వరకు పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.పెండింగ్ సమస్యల పరిష్కారం,4లేబర్ కోడ్ ల రద్దు సొంత ఇంటి పథకం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం నెలకు 26వేల వేతనం తగ్గకుండా ఇవ్వాలని,కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి యాజమాన్యం గతంలో బోర్ వెల్స్ వేసి బొగ్గునిక్షేపాలు కనుగొన్న శ్రావణ్ పల్లి కేటీకే 6,గోలేటి మహావీర్ కానీ ప్రాంతంలో సర్వే చేసిన గనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని వాస్తవ లాభాలను కూడా వెంటనే ప్రకటన చేయాలని లేనియెడల టిఎన్టియుసి ఆధ్వర్యంలో అన్ని జిఎం ఆఫీసుల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు టి మణి రామ్ సింగ్,గద్దెల నారాయణ,డి చంద్రమౌళి,గడిపల్లి శంకర్,ఎండి పాషా,పి రమేష్,రఘుపతి,ఆవుల సుధాకర్,పి రాజిరెడ్డి,రాజగోపాల్,ఓ జీవరత్నం,గజ్జల దుర్గయ్య,ఎండి అస్గర్,కన్నూరి శ్రీనివాస్,ఎస్ పాండే,కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హైటెక్ సిటీ యశోదలో 'ఇన్-హౌస్ ఎన్జీఎస్' సేవలు ప్రారంభం

**సమగ్ర జన్యు పరీక్షల ద్వారా క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు**

**వేగవంతమైన రిపోర్టులతో ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్ బాధితులకు మేలు**




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై 16(లోకల్ గైడ్ న్యూస్):ఈ సమావేశంలో ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శిఖర్ కుమార్ మాట్లాడుతూ, హనుమకొండ,క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తూ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ తాజాగా 'ఇన్-హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్' (ఎన్ జి ఎస్) సదుపాయాన్ని ప్రారంభించిందని తెలిపారు.గురువారం రోజునహనుమకొండలోని యశోద క్లినిక్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శిఖర్ కుమార్ ఈ వివరాలను వెల్లడించారు.?ప్రస్తుతం వైద్యరంగం సాంప్రదాయ విధానాల నుండి రోగి జన్యు నిర్మాణాన్ని విశ్లేషించి అందించే 'ప్రెసిషన్ ఆంకాలజీ' వైపు వేగంగా అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో యశోద హాస్పిటల్స్ సొంతంగా (ఇన్-హౌస్) ఎన్జీఎస్ ల్యాబ్ను ఏర్పాటు చేయడం క్యాన్సర్ రోగులకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు.?ఇన్-హౌస్ ఎన్జీఎస్ ప్రధాన ప్రయోజనాలివే..వేగవంతమైన నివేదికలు: ఆసుపత్రి ప్రాంగణంలోనే పరీక్షలు జరగడం వల్ల రోగి యొక్క జన్యుపరమైన మార్పులను అత్యంత వేగంగా, ఖచ్చితంగా గుర్తించవచ్చు.పరీక్షా ఫలితాల ఆధారంగా ప్రతి రోగి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా టార్గెటెడ్ ఓరల్ థెరపీలు, ఇమ్యూన్ చెక్పాయింట్ ఇన్హిబిటర్స్ వంటి ఆధునిక చికిత్సలను డిజైన్ చేయడానికి వీలవుతుంది. ముఖ్యంగా ఊపిరితిత్తుల రొమ్ము జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర కణితుల చికిత్స నిర్ణయాలలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.?ఒకే గూటి కింద ప్రపంచ స్థాయి వైద్యం?అత్యాధునిక సాంకేతికతను రోగులకు మరింత వేగంగా చేరవ చేయడమే తమ లక్ష్యమని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందం, రోబోటిక్ ఆంకోసర్జరీ, అత్యాధునిక రేడియేషన్ థెరపీ వ్యవస్థలతో పాటు ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఎన్జీఎస్ సదుపాయంతో క్యాన్సర్ రోగులకు ఒకే చోట అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమగ్ర వైద్య సేవలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్ సిబ్బంది సాయి వెంకట్, విజయ్ కుమార్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం: కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి



ఖమ్మం జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్ :జూలై -16 వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్ ఐ కేర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వార్డుకు చెందిన ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం, జ్వరం, దగ్గు, జలుబు తదితర సీజనల్ వ్యాధులపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు సూచించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, స్వయంగా మందులు వాడకుండా నిపుణుల సలహా మేరకే చికిత్స తీసుకోవాలని అన్నారు.ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా కీలకమని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ తమ వంతు కృషి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్ ఐ కేర్ నిర్వాహకులు ఉండ్రు శ్యాంబాబు, వైద్య సిబ్బంది దుర్గా మల్లేశ్వరి, శ్రీలత, శృతి, సుగుణ, నవీనతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెర్ప్, ఎస్ఆర్డీఎస్ సిబ్బందికి వైద్య శిబిరం ప్రారంభించిన కలెక్టర్ కె. హైమావతి

ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచన



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 16: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులోని జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జిల్లా సెర్ప్, ఎస్ఆర్డీఎస్ సిబ్బందికి ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టిపిఏ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి కొనుగోలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ వంటి బాధ్యతలతో క్షేత్రస్థాయిలో నిరంతరం పని చేసే సెర్ప్, ఎస్ఆర్డీఎస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పని ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు అందజేస్తామని, దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు వైద్యులు సూచించిన అదనపు పరీక్షలు కూడా చేయించుకోవాలని సూచించారు. రోజూ కనీసం గంటపాటు వ్యాయామం చేయడం, ఉదయం నడక, పోషకాహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష.. రూ.5 వేల జరిమానా విధించిన కోర్టు

లోకల్ గైడ్ సిద్ధిపేట, జూలై 16: మీరుదొడ్డి పోలీస్ స్టేషన్లో 2022లో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి, అపహరణ, పోక్సో కేసులో నిందితుడు తాడేం చందు (34)కు న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ తీర్పు వెలువరించారు.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి, సిద్ధిపేట ఏసీపీ దేవరెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి పటిష్టమైన ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆత్మరములు వాదనలు వినిపించగా, మీరుదొడ్డి ఎస్ఐ సతీష్, దుబ్బాక సీఐ రాజేష్, సిద్ధిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ పరశురాములు, హెడ్ కానిస్టేబుల్ అంజిరెడ్డి తదితరులు కేసు విచారణలో సమన్వయంతో సహకరించారు.సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిందితుడిని దోషిగా నిర్ధారించిన కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. కేసులో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు.మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, ఇలాంటి కేసుల్లో శాస్త్రీయ దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో నిందితులకు కఠిన శిక్షలు పడేలా సిద్ధిపేట పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సీపీ పేర్కొన్నారు. అలాగే పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## అంగన్ వాడి కేంద్రానికి గుండె గణేష్ ముదిరాజ్ చేయూత




లోకల్ గైడ్ శేరిలింగంపల్లి : సేవే పరమో ధర్మః అని నమ్మిన సిద్ధాంతాన్ని పాటిస్తూ తనకున్న దాంట్లో ఇతరులకు సేవ చేస్తున్న మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ గురువారం రోజు అంగన్వాడీ స్కూల్కు నా వంతుగా గ్యాస్ స్టవ్ మరియు ప్రెషర్ కుక్కర్ అందించడం జరిగిందనీ తెలిపారు. చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఈ చిన్న సహాయంలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందనీ ఆయన అన్నాడు. ఇతరులకు సహాయం చేసే అవకాశం ఇస్తున్న భగవంతుడికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, తనకు సహకరిస్తున్న ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నాడు.

## ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

## ముఖ్య సలహాదారు ఇ. వి. శ్రీనివాస్ రావు....వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ,కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. శ్వేతా ను మర్యాదపూర్వకంగా కలిసిన ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ ప్రతినిధులువరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా ని ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా , సలహాదారు ఇ. వి. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ సంక్షేమం, భద్రత, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం, సమాజంలో గౌరవప్రదమైన జీవనం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐ పి ఎస్ మాట్లాడుతూ, ట్రాన్స్జెండర్లకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్జెండర్ కమ్యూనిటీకి ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, చట్టబద్ధమైన రక్షణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ సలహాదారు ఇ.వి. శ్రీనివాస్ రావు, సభ్యులు రింషా, పూర్ణిమ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం: ఆల్ సంఘాల ఐక్యవేదిక




పెద్దపల్లి ప్రెస్ క్లబ్, జూలై 16:(లోకల్ గైడ్ )జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో పాటకుల మహేష్ ఆధ్వర్యంలో ఆల్ సంఘాల ఐక్యవేదిక తరఫున కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 18వ తేదీ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కమిషన్ బృందం నిర్వహించే సమావేశంలో ప్రస్తావించనున్న అంశాలను నాయకులు వివరించారు. పెద్దపల్లి జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, ఆలయ ప్రవేశానికి అడ్డంకులు, భూ వివాదాలు, కుల బహిష్కరణలు, హత్య కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తులో పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అంశాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులకు కమిషన్ ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బాధితులు, వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఆది జాంబవంతు అరుంధతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి పాపయ్య, తాండ్ర సదానందం, బొంకూరి సుభాష్, బోసెల్లి మహేష్, మదెల రాజన్న తదితరులు పాల్గొన్నారు

# వెంకటాపూర్‌లో పోలీస్ శాఖ ఉచిత వైద్య శిబిరం...

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి....**

**రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి.....**

**సిపి అంబర్ కిషోర్ ఝా.**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రామగుండం పోలీస్ కమిషనరేట్,మంచిర్యాల జోన్,కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్,సామాజిక బాధ్యతలో భాగంగా మెడీలైఫ్,సన్‌రైజ్ ఆసుపత్రుల సహకారంతో గురువారం దేవాపూర్ పోలీసులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పోలీస్ కమిషనర్,మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్‌లకు గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతు మారుమూల ప్రాంతాల్లో కూడా విద్య,వైద్యం,రవాణా వంటి మౌలిక సదుపాయాలు గణనీయంగా





అభివృద్ధి చెందడం ఆనందదాయకమన్నారు.గ్రామాల్లో మంచి పాఠశాలలు ఏర్పాటు కావడంతో పిల్లలు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారని,ప్రభుత్వ పాఠశాలలు కూడా మెరుగైన స్థాయిలో విద్యను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు ఐక్యంగా ఉంటు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు.ప్రస్తుతం ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయని,ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొందన్నారు.మహిళా సంఘాలు స్వయం ఉపాధి,రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడం అభివృద్ధికి మంచి సంకేతమని తెలిపారు.ప్రతి కుటుంబం యువతతో పాటు కుటుంబ సభ్యులెవరు మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మత్తు పదార్థాలు వ్యక్తిని,కుటుంబాన్ని,సమాజాన్ని నాశనం చేస్తాయని,అందరు వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు.ప్రతి ఒక్కరు రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని,చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలని,మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని,మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా మానుకోవాలని సూచించారు.ప్రజల భద్రత,సంక్షేమం కోసం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎల్లప్పుడు సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటుందని,ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరిస్తు శాంతియుత,సురక్షిత,అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన గ్రామ సర్పంచ్,గ్రామ పెద్దలు,గ్రామస్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, పల్మనాలజీ (ఊపిరితిత్తుల వైద్యం),గైనకాలజీ (స్త్రీల వైద్యం), ఆర్థోపెడిక్స్ (ఎముకలు,కీళ్ల వైద్యం),జనరల్ సర్జరీ,రేడియాలజీ,ఆప్తాల్మాలజీ (కంటి వైద్యం)విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలందించారు.రక్తపోటు (బీపీ),రక్తంలో చక్కెర పరీక్ష,ఈసీజీ,పీఎఫ్‌టీఈ (ఊపిరితిత్తుల పనితీరు పరీక్ష),2డీ ఎకో,అల్ట్రాసౌండ్,కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని,నిపుణులైన వైద్యుల ద్వారా తమ ఆరోగ్య సమస్యలకు సలహాలు,చికిత్స పొందాలని సీపీ కోరారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,మందమర్రి సిఐ పి రమేష్,దేవాపూర్ ఎస్ఐ గంగారం,కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు,మందమర్రి ఎస్ఐ నరేష్,రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్,మెడీలైఫ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ గౌతమ్,డాక్టర్ సిరిపురం శ్రీనివాస్,డాక్టర్ అభినయ్,డాక్టర్ బోస్,డాక్టర్ స్వాప్రిక,సన్‌రైజ్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్,స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామస్థులు,యువత,విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన బాధ్యతలు తీసుకున్న సౌమ్య రంజన్ దాస్ సప్లై లాజిస్టిక్ మేనేజర్



లోకల్ గైడ్ మేడ్చల్ న్యూస్ గత ఐదు సంవత్సరాలుగా తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ, మేడ్చల్ వాసులకు స్నేహ సంబంధాలతో ఎల్లప్పుడూ కష్ట సుఖాలను తెలుసుకుంటూ అనుభవాలను పంచుకుంటూ ఇటీవల ప్రమోషన్ తో బదిలీ అవుతున్న సందర్భంగా తమ స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ తన అనుభవాలను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేడ్చల్ వాసులతో గడిపిన క్షణాలు మొదల మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పవన్, నవీన్, వినయ్ కుమార్, అరుణ, అనూష, హారిక, చంద్రశేఖర్ అభినందన్,శివ కుమార్, కృష్ణారెడ్డి, మైపాల్, సౌమ్య రంజన్ దాస్, అక్షయ్, విశ్వజిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బతికుండగానే మృతురాలిగా చూపించి భూమిని వేరే వారి పేరుపైకి.

### - తహసీల్దార్‌పై చర్యలు తీసుకువాలంటున్నా బాధితులు




పెద్దపల్లి , జూలై 16:(లోకల్ గైడ్ )తాను బతికుండగానే మృతురాలిగా చూపించి తన భూమిని అక్రమంగా వేరే వ్యక్తి పేరుపై వారసత్వ పట్టా చేశారని పాలకుర్తి మండలానికి చెందిన ఓ గిరిజన మహిళ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు బామ్లా నాయక్ తండాకు చెందిన ఇస్లావత్ సుజాత కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన అనంతరం జిల్లా కేంద్రంలోని మీడియాతో మాట్లాడారు. బాధితురాలి కథనం ప్రకారం.. గతంలో ప్రభుత్వం తమ గ్రామంలోని 66 మంది గిరిజన కుటుంబాలకు సర్వే నంబర్ 111లో ఒక్కొక్కరికి 24 గుంటల చొప్పున భూమిని కేటాయించింది. అయితే ఇటీవల రైతు భరోసా నిధులు తన ఖాతాలో జమ కాకపోవడంతో విచారించగా, తన పేరుపై ఉన్న భూమి మరొకరి పేరుపై వారసత్వంగా పట్టా అయినట్లు తెలిసిందని తెలిపిందన్నారు. తాను జీవించి ఉండగానే నకిలీ మరణ ధృవీ...

## బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వడం హర్షణీయం

### -కవిత నిర్ణయాన్ని స్వాగతించిన బీసీ నాయకులు..

-సలేంద్ర కొమురయ్య నియామకంపై హర్షం




పెద్దపల్లి ప్రెస్ క్లబ్, జూలై 16: (లోకల్ గైడ్ )తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల జాబితాలో 12 మంది బీసీ నాయకులకు అవకాశం కల్పించడం పట్ల పలువురు బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉద్యమకారుడు, బీసీ నాయకుడు సలేంద్ర కొమురయ్యను నియమించడం పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకుడు బొంగోని శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గాలకు సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ కల్వకుంట్ల కవిత తీసుకున్న నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలు, ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన బాధ్యతలు అప్పగించడం నాయకత్వ గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉత్తం శ్రీనివాస్ మాట్లాడుతూ.. సలేంద్ర కొమురయ్య నియామకం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి దక్కిన గౌరవమని అన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా కవిత తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. కలవుల తిరుపతి మాట్లాడుతూ.. 2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు సలేంద్ర కొమురయ్యకు పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం పట్ల బీసీ బిడ్డలందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో బీసీలందరినీ ఏకం చేసి తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసేందుకు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకత్వానికి సముచిత ప్రాధాన్యత కల్పించి తమపై విశ్వాసం ఉంచిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిలుక ఆనంద్, మల్యాల కరుణాకర్, అంబాల మహేష్, నల్లగొండ స్వామి, సుల్తానాబాద్ మండల నాయకుడు గుర్రం శ్రీనివాస్, ఓదెల మండల నాయకుడు పల్లె శ్రీనివాస్, అంతర్గాం మండల నాయకుడు రాజ్‌కుమార్ యాదవ్, పెద్దపల్లి మండల నాయకుడు సీహెచ్ హనుమన్నతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పంపులు వెంటనే ప్రారంభించి చెరువులను నింపాలి

-బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్




పెద్దపల్లి , జూలై 16:(లోకల్ గైడ్ )ఉత్తర తెలంగాణలో సాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోందని, ఎండిపోయిన చెరువులను నింపేందుకు ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపులను ప్రారంభించాలని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో ఎల్లమ్మ చెరువు సహా అనేక చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు నాట్లు వేయలేక అల్లాడుతున్నారని రాకేష్ కుమార్ పేర్కొన్నారు. డీ-83, డీ-86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో సాగునీటి సమస్య జఠిలమైందని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమైందని గణాంకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కంటే బీఆర్ఎస్ నాయకులను విమర్శించడానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రెస్‌మీట్లతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. “రక్తాలతోనే పంటలు పండుతాయి అనుకుంటే, ఎవరి రక్తం వాడాలో ప్రజలే నిర్ణయిస్తారు” అంటూ రాకేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రెండేళ్లు గడిచినా కనీసం పనులు ప్రారంభించలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చేసిన సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించాలని, అవసరమైతే నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణరావు పెద్దపల్లి సాగు పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీధర్ బాబు తండ్రి పేరుతో ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని నింపాలని కోరారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని ఆయన వెల్లడించారు. తాగునీటి అవసరాలు, ఎన్టీపీసీ అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే, సాగునీటికి తీవ్ర కొరత తప్పదని హెచ్చరించారు. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టి శ్రీపాద ఎల్లంపల్లిని నింపి, ఆ నీటిని చెరువులకు తరలించాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటలు వేయాలని సూచిస్తున్నారని, ఇది రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ఎద్దడికి నిదర్శనమని రాకేష్ కుమార్ అన్నారు. రాజకీయ విమర్శలు మానుకొని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దగ్గర గల ప్రెస్ క్లబ్ లో జరిగిన టిఎస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.చిరుమిల్ల రాకేష్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ స్వామి , ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్, పోసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పు శివ కుమార్, బోయిని మనోజ్, కంచి నాగరాజ్ , పాయిలి కిరణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో ఎల్‌నినోం ప్రభావాన్ని అధిగమించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి

వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలి



పెద్దపల్లి, జూలై – 16(లోకల్ గైడ్ )ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా సాగు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ నిర్వహించిన అంచనాల ప్రకారం 207 గ్రామాలు మోస్తరు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని, అయితే తీవ్ర ప్రభావం లేదా స్వల్ప ప్రభావం ఉన్న గ్రామాలు ఏవీ లేవని కలెక్టర్ తెలిపారు.జూలై 15 నాటికి జిల్లాలో మొత్తం 91,136 ఎకరాల్లో పంటల సాగు అంచనా వేయగా, ఇందులో 10,510 ఎకరాలు వర్షాధార పంటలు, 80,626 ఎకరాలు సాగునీటి ఆధారిత పంటలు ఉన్నాయని తెలిపారు. ఇంకా 1,84,671 ఎకరాల్లో సాగు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జూలై 16 నుంచి 31 వరకు జిల్లాలో 89,892 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 84,500 ఎకరాల్లో వరి, 1,814 ఎకరాల్లో కందులు, 1,182 ఎకరాల్లో పెసల్లు, 186 ఎకరాల్లో మినుములు, 136 ఎకరాల్లో అలసందలు, 16 ఎకరాల్లో ఉలవలు, 8 ఎకరాల్లో ఆముదం, 925 ఎకరాల్లో మొక్కజొన్న, 3 ఎకరాల్లో పశుగ్రాస జొన్న, 471 ఎకరాల్లో కూరగాయలు, 651 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నట్లు తెలిపారు.ప్రతిపాదిత సాగుకు అవసరమైన 17,259.03 క్వింటాళ్ల విత్తనాలకు గాను జిల్లాలో ఇప్పటికే 21,564.44 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు విత్తనాల కొరత తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల సాగుపై సాంకేతిక సూచనలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, సాగు విధానాలను పాటిస్తూ సకాలంలో విత్తనాలు వేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 16 : నందిపేట మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం



బస్తాలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. చిన్నచిన్న లోపాలను గమనించిన కలెక్టర్, వాటిని సరి చేసుకోవాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. అనంతరం 7వ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో భేటీ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు వేసి, విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు తప్ప ఇతరులు ఎవరు వచ్చినా వారితో వెళ్లకూడదని జాగ్రత్తలు సూచించారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను విద్యార్థినులకు అందించారు. ఇష్టపడి చదువుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. వారిలో స్ఫూర్తిని పెంపొందింపజేశారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కాగా, పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయం పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి తదితరులు ఉన్నారు.

## నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 16 : జాతీయ ఆహార నూనెల మిషన్--ఆయిల్ పామ్ (చీవీజూ-ఞా) పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆయా మండలాలలో రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. దీంతో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు రైతులు ఉత్సాహంతో ముందుకు వస్తున్నారని అన్నారు. ఇప్పటికే 134.50 ఎకరాలలో 6725 ఆయిల్ పామ్ మొక్కలను నాటడం పూర్తయ్యిందని వివరించారు. 2027 మార్చి నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగు జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆయిల్ పామ్ వల్ల సమకూరే లాభాలను గుర్తించి, అనేక మంది ఔత్సాహిక రైతులు ఈ పంట సాగుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తూ డీ.డీలు చెల్లిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తంగా జిల్లాలో 6500 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగులో ఉందని, అదనంగా ఈ ఏడాది 2వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు కోసం సరిపడా రెండు లక్షల ఆయిల్ పామ్ మొక్కలను నర్సరీలో సిద్ధంగా ఉంచామని కలెక్టర్ తెలిపారు. సంప్రదాయ వరి పంటతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగు వల్ల అధిక లాభాలు సమకూరుతాయని, వరికి ఇది మంచి ప్రత్యామ్నాయం అని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందని, జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు.

## భద్రాచలంలో ఘనంగా దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాల పంపిణీ

విద్యతోనే భవిష్యత్తు ఉజ్వలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు




భద్రాచలం. : లోకల్ గైడ్ :భద్రాచలం గర్ల్స్ హైస్కూల్లో విద్యాశాఖ -- సమగ్ర శిక్ష తెలంగాణ, ఏఎల్ఐఎంసీవో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు విద్యలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు, ప్రత్యేక ఉపకరణాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్య ద్వారా దివ్యాంగ విద్యార్థుల జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సమాజంలో సమాన అవకాశాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అవసరమైన మద్దతు అందించడంలో ఎలాంటి లోటు ఉండదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నం రమాకాంత్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, పడిసిరి శ్రీనివాస్, పిలక వెంకటరమణరెడ్డి, వార్డు సభ్యులు బొంత రమణ, బండారు శరత్, ఇనుముల అశోక్, ఇర్పా అనసూయ, యూత్ నాయకులు ఎడారి ప్రదీప్, గాడి విజయ్, ఆకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## : మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి బూటకపు దీక్షలు మానాలి

బీఆర్ఎస్ హయాంలో అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తోంది

డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి ధ్వజం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గుడే ), జూలై 16: కేసీఆర్ దత్తపుత్రునిగా, కమిషన్లు దండుకున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జిల్లాకు ఆర్గబెట్టింది ఏమిలేదని డిసిసి అధ్యక్షుడు టి. నగేష్ రెడ్డి ద్వజమేత్తారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు తాహెర్ నగేష్ రెడ్డి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పటికైన బూటకపు దీక్షలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజల్లో రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే ప్రశాంత్ రెడ్డి నిరాహార దీక్ష పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో భీంగల్ 100 పడకల ఆసుపత్రి, చేపల మార్కెట్, రహదారులు, మంచిప్ప ప్రాజెక్టు వంటి అనేక అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదిలేసి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బిఆర్ ఎస్ హయాంలో చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన ఎన్నో పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు సంక్షేమం, మున్సిపల్ అభివృద్ధి పనులు, భీంగల్ పట్టణానికి అదనపు నిధుల కేటాయింపు వంటి హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వానికే మద్దతు ఇస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు రత్నాకర్ గౌడ్, గాదరి గోపి, కోశాధికారి భక్తవత్సలం, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జావీద్ అక్రం, లింగన్న, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ హేమచల లక్ష్మి - నృసింహ స్వామి దేవస్థానం అభివృద్ధి గురించి అధికారులతో రివ్యూ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క





ములుగు జిల్లా మంగపేట (లోకల్ గైడ్) రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి వారికి నిధులు 17 కోట్ల రూపాయల ఎస్టిమేషన్ పంపిస్తే ప్రాథమికంగా మండపానికి 3 కోట్ల రూపాయలు కేటాయింపు. మిగతా రూపాయలు విడతల వారిగా విడుదల తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడి. ములుగు జిల్లా,మంగపేట మండలం,మల్లూరు గ్రామంలో క్రీస్తు శకం ఆరవ దశబ్దంలో స్వయంభుగా వెలసిన శ్రీ శ్రీ శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం అభివృద్ధి పనుల కోసం అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖల,గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ మాత్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హాజరవ్వగా దేవస్థాన ఈవో వీరాస్వామి తో పాటుగా ఆలయ అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా స్వామి వారి దర్శనం అనంతరం వారి చరిత్ర ను విశిష్టతను వివరించి శేష వస్త్రమును అందజేసిన అర్చక సిబ్బంది. స్వామి వారి దర్శనం అనంతరం అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి దేవస్థాన అభివృద్ధి గురించి సమిష్టిగా అందరు అధికారులు కలిసి సమన్వయంతో ఎస్టిమేషన్లను, పనులను త్వరత్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశ అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను సంపన్నులు చేయాలనే దూర దృష్టితో మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలని వారిని అన్ని రకాలుగా పైకి తీసుకురావాలని దృఢ సంకల్పంతో మదర్ ఎడ్యుకేషన్ మరియు రూరల్ డెవలప్మెంట్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో మల్లూరు గ్రామాలలో మహిళలకు ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి వారికి పలు సూచనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో... ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ , జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకెన్ ఐ టి డి ఎ పి ఓ ఏటూరునాగారం లెనిన్ వత్సల్ ,జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ,జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి ఆర్డిఓ ములుగు ఏ.ఎస్.పి, ఏటూరునాగారం మనన్ బట్ ,రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య తాసిల్దా రు తోట రవీందర్ ఎంపిడిఓ భద్రు మల్లూరు దేవస్థానం ఈవో విరస్వామి మరియు అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాలు,ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామ పార్టీల అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

## సీతారామ ప్రాజెక్ట్ సమీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

### సీతారామ ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయాలి : మంత్రుల ఆదేశం



భద్రాద్రి జిల్లా, అశ్వాపురం : లోకల్ గైడ్ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద ఉన్న సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌లో గురువారం నిర్వహించిన ప్రాజెక్ట్ పనుల పరిశీలన, సమీక్షా కార్యక్రమంలో కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్, మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యకర్తలతో కలిసి సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ప్రాజెక్ట్ పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తయితే జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

## నందిపేట తహసీల్దార్ కార్యాలయంను తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 16 : నందిపేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన సందర్భంగా లోపాలను గుర్తించి, తహసిల్దార్, సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు తావు కల్పించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూములు కబ్జాకు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఉన్నారు.

## ఉమ్మడి నిజామాబాదు జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరి

**ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై16: ఉమ్మడి నిజామాబాదు జిల్లా అభివృద్ధికి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మరో కీలక ముందడుగు వేశారు. జిల్లాలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధికి అవసరమైన పలు ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు నిజామాబాదు నగరంలోని తిలక్ గార్డెన్లో ఉన్న రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆడిటోరియాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు అనువుగా తీర్చిదిద్దను న్నారు. అలాగే భీంగల్ మండలంలో గల లింబాద్రి గుట్ట వద్ద టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించారు. మరోవైపు ఆర్మూర్ లోని సిద్ధుల గుట్ట టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుతో పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### పీ ఎం కిసాన్ కటాఫ్ తేది పెంచాలి...

## రైతులకు న్యాయం చేయాలి

నారాయణపేట జూలై 16:(లోకల్ గైడ్ ), దేశ వ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించే పీ ఎం కిసాన్ సమ్మాన్ నిధి కి దరఖాస్తు చేసుకోవడానికి కటాఫ్ తేది పెంచి రైతులకు అవకాశం ఇవ్వాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశంలో ఈ విషయాన్ని చర్చించి సన్నకారు, చిన్నకారు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ పథకంలో చేరుటకు కటాఫ్ తేది 2019 జనవరి 31 వరకు మాత్రమే ఇచ్చా రు.ఆ తర్వాత పథకంలో చేరుటకు దరఖాస్తు చేసు కుందామంటే కటాఫ్ తేది పెంచలేదు. ఈ పథకం ప్రారంభము అయినప్పుడు 5 సంవత్సరాల తర్వాత ఈ పథకంలో చేరుటకు అవకాశం ఇస్తామని చెప్పి ఇవ్వలేదు కావున అర్హత గల రైతులు పెట్టుబడి సాయం పొందలేక పోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హత గల సన్నకారు, చిన్నకారు రైతులు ఈ పథకంలో



చేరుటకు నిబంధనలు సడలించి కటాఫ్ తేది పెంచాలని కోరారు.

## పగుడాకుల శ్రీనివాస్ ను పరామర్శించిన ఎంపీ అరుణ

నారాయణపేట జూలై 16:(లోకల్ గైడ్ ), నారాయణపేట జిల్లా మాజీ అధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా బీజేపీ



ఇంచార్జ్ పగడాకుల శ్రీనివాస్ మాతృ మూర్తి పగడాకుల వెంకటమ్మ మరణవార్త తెలుసుకొని, నారాయణపేట జిల్లా మండల కోటకొండ లోనీ వారి నివాసానికి బుధవారం రాత్రి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఎంపీ.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించారు.శ్రీనివాస్ ను పరామర్శించారు.

## చట్టం తెచ్చి అమలు విఫలమైన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్

నారాయణపేట జూలై 16:(లోకల్ గైడ్ ), న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకువచ్చి అమలు



చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ ఒక ప్రకటనలో విమర్శించారు.దానికి తాజా ఉదాహరణ ఉండేకొడ్ నీరజ్ పై దాడికి జరగడమేనని అన్నారు.నిరసనగా రెండో రోజులు నారాయణపేట జిల్లా కోర్టులో న్యాయవా దులు కోర్టు విధులను బహిష్క రించిన నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే అన్నారు.ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే నిధులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు, ఈ విషయంలో బాధితునికి సహకరించక నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారులుసంబంధిత ఎస్సై సీఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

### కుటుంబ సభ్యుల తో కలిసి

## ఓటరు నమోదు పత్రం పూర్తి చేసిన ఎస్ ఆర్ రెడ్డి

నారాయణపేట జూలై 16:(లోకల్ గైడ్ ), నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి గురువారం ఓటర్ ఎన్యూమరేట్ ఫారాలను భర్తీ చేసి బి ఎల్ ఓ కు అందజేశారు. నారాయ ణపేట నియోజక వర్గంలోనీ కోయిల్ కొండ మండలం తన స్వంత గ్రామం శేరివెంకటపూర్ లో కుటుంబ సమేతంగా కలిసి బి ఎల్ ఓ కు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ ఆర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు గా నమోదు కావడం ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, ఎన్యూమరేషన్ దరఖాస్తు ప్రక్రియల్లో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని బి ఎల్ ఓ లకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేట కోర్టులో రెండో రోజు న్యాయవాదుల వీధుల బహిష్కరణ



నారాయణపేట జూలై 16(లోకల్ గైడ్ ), :న్యాయవాది ఉండేకొడ్ నీరజ్ పై దాడికి నిరసనగా గురువారం రెండో రోజు నారాయణపేట జిల్లా కోర్టులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్క రించారు.నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు, ఈ విషయంలో బాధితునికి సహకరించక నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారులుసంబంధిత ఎస్సై సీఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం న్యాయవాది రఘువీర్ యాదవ్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం చెన్నారెడ్డి కార్యదర్శి అమీరుద్దీన్, న్యాయవాదులు కురుమన్న గౌడ్ నరసింహులు యాదవ్ టి రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్ నామాజీ, వినోద్ ఆడెం శ్రీనివాస్, దత్తాత్రేయ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట జూలై 16(లోకల్ గైడ్ ), : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. బేటీ బచావో - బేటీ పడావో పథకంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సత్య సాయి కాలనీ లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కు వచ్చిన విద్యార్థినులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూనేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. అందరూ సెల్ ఫోన్ లో చాట్ జీపీటీ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని, ఇప్పుడు అదే వర్డ్ డాక్యుమెంట్ను కూడా ఇది తయారు చేసి ఇస్తుందన్నారు. మనం ఏదైనా సమాచారం కోసం టైప్ చేసి రాయడానికి సమయం తీసుకునేలోపే, అడిగిన సమాచారాన్ని సిద్ధం చేసి అందిస్తుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ అంత ముందుకు వెళ్లిందనీ, ఈ బేసిక్స్తో పాటు అడ్వాన్స్డ్ టెక్నాలజీ నేర్చుకోవడం కూడా అంత కష్టమేమీ కాదన్నారు. శిక్షణలో ఇవన్నీ నేర్చుకోవాలని,తర్వాతి క్లాస్లో మీరు ఇవన్నీ చేయగలుగుతున్నారా ? లేదా చూస్తాననీ ఆమె చెప్పారు. ప్రాక్టీస్ చేయడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా, అడ్వాన్స్డ్ టెక్నాలజీని కూడా ఉపయోగించిన వారవుతారనీ ఆమె తెలిపారు. అందరూ తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేయాలని, ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు కూడా చాలా వస్తున్నాయనీ, ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే కాకుండా, ప్రైవేట్ ఉద్యోగాలకు కూడా తప్పకుండా అప్లై చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ రాజేందర్ గౌడ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, డీ డబ్ల్యు ఓ కార్యాలయ ఉద్యోగులు, కంప్యూటర్ శిక్షకులు పాల్గొన్నారు.

### సత్తుపల్లి. గురువారం

## సీతారామ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా నిర్మిస్తున్న

ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో. లోకల్ గైడ్. సత్తుపల్లి. గురువారం సీతారామ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ ను పరిశీలించేందుకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, గౌరవ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గార్లకు హెలీప్యాడ్ వద్ద పూల మొక్కలు అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గారు.



## పాల్వంచ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబాటు

**45వ డివిజన్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన**

**ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే సాంబశివరావు**



భద్రాద్రి జిల్లా, పాల్వంచ : లోకల్ గైడ్ :పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 45వ డివిజన్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగాసీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంలో ఎలాంటి రాజీ పడబోమని, చేపట్టిన ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, పాల్వంచ పట్టణాన్ని ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కమిషనర్ సుజాత, 1వ డివిజన్ కార్పొరేటర్ సుగుణ, 45వ డివిజన్ కార్పొరేటర్ దంతెబోయిన నరేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 108 & 102 అంబులెన్స్ లలో ఆకస్మిక తనిఖీలు చేసిన అధికారులు

**అత్యవసర ఆరోగ్య సేవలు ప్రజలకు అందింటమే ప్రభుత్వ లక్ష్యం**





లోకల్ గైడ్ న్యూస్ 16 కొందుర్గ్..తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108, 102 అంబులెన్స్ సేవలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 108 కోఆర్డినేటర్ రాజబాబు, 102 కోఆర్డినేటర్ శ్రీహరి పాల్గొని అంబులెన్స్లలో అందుబాటులో ఉన్న అత్యవసర మందులు, వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్లు, స్ట్రెచర్లు, మానిటరింగ్ పరికరాలు తదితర ప్రాణరక్షక సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని మందులు, పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అంబులెన్స్ల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించి, విధుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీలో సంబంధిత అధికారులు, 108 పైలట్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారుం

### భవన నిర్మాణ కార్మికుల

## సమస్యల పరిష్కారానికి ఈనెల 20న రాష్ట్రవ్యాప్త ధర్నా

**ఆమనగల్లు లో కరపత్రాల విడుదల -- విజయవంతం చేయాలని సంఘం పిలుపు**



లోకల్ గైడ్ఆమనగల్లు, జూలై 16 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపిస్తూ ఈనెల 20న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లాఆమనగల్లు పట్టణ కేంద్రంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి కార్మికులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును బలోపేతం చేసి, వెల్ఫేర్ బోర్డులో ఉన్న రూ.13 వేల కోట్ల నిధులను పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై విధించిన వెల్ఫేర్ సెస్ను రూ.12 నుంచి రూ.54కు పెంచిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రమాద మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, 55 సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు నెలకు రూ.6 వేల పెన్షన్ అందించాలని కోరారు.అలాగే కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ లు, గృహ వసతి, మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని, ఇసుక కొరత కారణంగా ఉపాధి కోల్పోతున్న నిర్మాణ కార్మికులకు తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని, అర్హులైన ప్రతి నిర్మాణ కార్మికుడికి 15 రోజుల్లో లేబర్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న జరిగే రాష్ట్రవ్యాప్త ధర్నా లో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్, మండల గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, మాజీ అధ్యక్షులు దూసకంటి యాదయ్య, మాజీ కార్యదర్శి నాగిళ్ల యాదయ్య, ముఖ్య సలహాదారుడు ముక్కరి కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు పులికంటి మైసయ్య, మారేపల్లి జంగయ్య, మీసాల లక్ష్మయ్య, జంతుక జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 641 రద్దు చేయాలి

### పార్టీ లకు అతీతంగా కలిసి పోరాడుదాం..

**డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపిన ఎంపీ డీకే అరుణమ్మకు ధన్యవాదాలు..**

**డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ.**

**ఎంపీ డీకే అరుణమ్మకు వినతిపత్రం అందజేత.**



కొత్తూర్ జులై 16 (లోకల్ గైడ్ ) అందరి లక్ష్యం డంపింగ్ యార్డ్ రద్దని దాన్ని సాధించేందుకు పార్టీలకతీతంగా పోరాడుదామని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ అన్నారు.డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపేందుకు గురువారం ఆమె మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆమెకు డంపింగ్ యార్డ్ రద్దుకు



మద్దతు తెలిపాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిద్ధాపూర్ చుట్టూ ఉన్న సుమారు 50 గ్రామాలకు డంపింగ్ యార్డ్ ఎఫెక్ట్ ఉంటుందని అన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు చిన్న సన్నకారు రైతులే ఉన్నారని పొట్ట కొట్టి వారి జీవితాలను రోడ్డున వేయొద్దని వేడుకున్నారు. మేమంతా ఒక తల్లి పిల్లలమని పార్టీ జెండా, ఎజెండా పక్కనపెట్టి పోరాడుదామని పిలుపునిచ్చారు.రైతు కాండువతో చలో సెక్రటేరియట్ గాని చలో కలెక్టరేట్ అని ఏ ఒక్కరు పిలుపునిచ్చిన లక్ష మందితో విజయవంతం చేయాలని అన్నారు.భార్యా పిల్లలను వదులుకొని పనిచేస్తున్నామని ప్రభుత్వం జీవో నెంబర్ 641 రద్దు చేయకపోతే చివరకు ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతామని హెచ్చరించారు.డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపిన ఎంపీ డీకే అరుణమ్మకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్,బిజెపి పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రముఖ చిత్రకారుడు ఎంగలి రాఘవేందర్

సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం









లోకల్ గైడ్ ఆమనగల్లు, జూలై 16 రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఎంగలి రాఘవేందర్ నిర్వహిస్తున్న లైట్ ఎట్. సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ నేడు హైదరాబాద్లోని చిత్రమయీ స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్లో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.రాఘవేందర్ రూపొందించిన చిత్రాలు రంగులు, వెలుగు, భావోద్వేగాలు, ప్రకృతి, మానవ జీవితంలోని అనేక కోణాలను ప్రతిబింబిస్తూ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి చిత్రంలో కనిపించే భావవ్యక్తీకరణ, సృజనాత్మకత, రంగుల సమన్వయం కళాభిమానులను ఆలోచింపజేస్తూ ప్రత్యేక అనుభూతిని కలిగిస్తున్నాయి.ఆమనగల్ ప్రాంతానికి చెందిన అనేక మంది చిత్రకారులు తమ ప్రతిభను చాటుకున్నప్పటికీ, సొంతంగా వ్యక్తిగత (సోలో) చిత్రకళా ప్రదర్శన నిర్వహించడం ఎంగలి రాఘవేందర్కు ఒక ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. తన కళా ప్రస్థానంలో సాధించిన ఈ మైలురాయి ఆమనగల్ కళాకారులకు స్ఫూర్తిదాయకంగా మారిందని పలువురు కళాప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.ఈ



ప్రదర్శనలో ప్రదర్శించిన చిత్రాలు మానవ సంబంధాలు, ప్రకృతి సౌందర్యం, వెలుగు--చీకట్ల తాత్విక భావనలు, సమకాలీన జీవన విధానాన్ని ప్రతిబింబిస్తూ కళా ప్రపంచంలో రాఘవేందర్ ప్రత్యేక శైలిని చాటుతున్నాయి.అవనగల్లు పట్టణానికి చెందిన కళాకారుడు రాష్ట్ర రాజధానిలో ఇలాంటి ప్రతిష్ఠాత్మక సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు, కళాకారులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు. ఆమనగల్లు కళా ప్రతిభను రాష్ట్ర స్థాయిలో మరింత గుర్తింపు పొందేలా రాఘవేందర్ కృషి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

## 'మై భారత్ -- విక్సిత్ భారత్'

### యువజన నమోదు, అవగాహన ప్రచార పోస్టర్‌ను విడుదల.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): "మై భారత్ -- విక్సిత్ భారత్" విస్తృత యువజన నమోదు, అవగాహన ప్రచార అధికారిక పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐ ఏ ఎస్ అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, జిల్లా యువత మై భారత్ పోర్టల్‌లో చురుకుగా నమోదు చేసుకోని స్వచ్ఛంద సేవ, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వం, దేశ నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో యువత ఉత్సాహంగా పాల్గొని, విక్సిత్ భారత్ ఆశయ సాధనకు దోహదపడాలని సూచించారు. ఈ అవగాహన ప్రచారాన్ని మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్ మార్గదర్శకత్వంలో సమన్వయం చేస్తున్నారు. విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా యువత నమోదు, భాగస్వామ్యాన్ని గరిష్ఠ స్థాయికి చేర్చడమే ఈ ప్రచార లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమం విజయవంతంగా అమలు జరిగేందుకు జిల్లా అధికారులు తమ మద్దతును అందించారు. అలాగే, అర్హులైన యువతలో అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు, యువజన సంఘాలు, వాలంటీర్లను ప్రోత్సహించారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమానికి మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్, శ్రీశైలం, కార్యాలయ సిబ్బంది, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.

## తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి బోధించాలి జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతు తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని తెలుగు భాష ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో తెలుగు భాషపై ఆసక్తి,అభిరుచిని పెంపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఇతర భాషల ప్రభావం కారణంగా విద్యార్థులకు తెలుగు భాషను సమర్థవంతంగా బోధించడం కొంత సవాలుగా మారిందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు తెలుగు ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనా విధానాలను అవలంబించాలని తెలిపారు. ముఖ్యంగా కథలు,కవితలు,పద్యాలు,నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు,శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కో ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య,శిక్షణ కేంద్ర ఇంచార్జి బోనగిరి శ్రీనివాస్,జిల్లా స్థాయి డి ఆర్ పి లు,తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మరణానంతరం కూడా ఇద్దరికీ వెలుగునిచ్చిన మహోన్నత నిర్ణయం




ఖమ్మం :లోకల్ గైడ్ :ఖమ్మం కార్పొరేషన్ 53వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ గట్టయ్య చిన్న తమ్ముడు చంద్రకాని శ్రీనివాస్ తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు . వారి మరణం కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది . వారు భౌతికంగా మన మధ్య లేకపోయినా వారి కుటుంబ సభ్యులు తీసుకున్న గొప్ప మానవతా నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలిచింది . ఖమ్మం నేత్రనిధి నిర్వాహకులకు సమాచారం అందించి వారి నేత్రాలను దానం చేయించారు . ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు వెలుగు ప్రసాదించే అవకాశం లభించింది . మరణానంతరం కూడా సమాజానికి సేవ చేసే ఈ మహోన్నత నిర్ణయం నిజంగా అభినందనీయం . ఈ సందర్భంగా ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు , మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్ , ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్ దివంగత చంద్రకాని శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు . అలాగే నేత్రదానం వంటి మహోన్నత సేవకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను హృదయపూర్వకంగా అభినందించారు .

## ప్రజలు జీవించే హక్కును కాపాడాలి.!

### పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు..!



కొత్తూర్ జులై 16 (లోకల్ గ్రైడ్ )కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని ప్రజలు జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేస్తు సిద్దాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డు స్థలంలో గ్రామస్తులతో పాటు గిరిజనులతో తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలు సమావేశమయ్యారు. సిద్దాపూర్ పరిసర గ్రామాలను తండాలను సందర్శించి నిజ నిర్ధారణ జరిపారు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఐటి పరిశ్రమల కోసం రైతుల నుండి దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములలో ఐటీ పార్క్ మరియు ఇతర ఉపాధి పరిశ్రమలు కాకుండా ప్రజల జీవితాలను హరించే డంపింగ్ యార్డును ఏకో టౌన్షిప్ పేరుతో ఏర్పాటు చేయాలని జీవో 641 విడుదల చేయడం జరిగిందని ఈ డంపింగ్ ఏర్పాటు చేయడం వల్లనా దాదాపు 7 మండలాలలోని 50 గ్రామాలకు చెందిన ఆరు లక్షల మంది ప్రజలు ప్రత్యక్ష మరియు పరోక్ష ప్రభావానికి గురవుతున్నారని అంతేకాకుండా సిద్దాపూర్ గ్రామంలో ఉండే చెరువులు కలుషితమవుతూ ప్రజలకు వన్య ప్రాణులకు మరియు ప్రకృతి వనరులు మొత్తం కలుషితమయ్యే అవకాశం ఉందని ఈ ప్రాంతం నుండి వ్యవసాయం చేసి హైదరాబాద్ కు కూరగాయలు పాలు ఎగుమతి చేయడం జరుగుతుందని ఈ డంపింగ్ యార్డ్ వల్ల ఆహార పదార్థాలు కూడా పూర్తిగా విషపూరితమయ్యే అవకాశం ఉందని ఇప్పటికే కొత్తూరు ఇండస్ట్రియల్ గా ప్రకటించినందున ఎన్నో కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటుతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని భూగర్భ జలాలు ఇప్పటికే కలుషితమయ్యాయని డంపింగ్ యార్డ్ వల్ల గాలి కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు విషపూరితమైయై ఆందోళనలో ప్రజలు ఉన్నారని అత్యంత ప్రమాదమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు మరింత విస్తరించే అవకాశం ఉందని కాబట్టి వెంటనే జీవో 641 ను రద్దు చేసి డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, సహాయ కార్యదర్శి తిరుమలయ్య,కమిటీ అధ్యక్షుడు మిట్టు నాయక్, సుభాన్,రాములు,వెంకటేష్,బాలయ్య,బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లా రహదారుల అభివృద్ధికి కేంద్రమంత్రికి తుమ్మల లేఖలు



లోకల్ గైడ్. ఖమ్మం. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కి.మీ లింకుకు మంజూరు కోరిన మంత్రి కొత్తగూడెం-పాల్వంచలకు 25 కి.మీ బైపాస్ ప్రతిపాదన భద్రాచలం పట్టణానికి రూ.25 కోట్లతో బైపాస్.. తక్కువ వ్యయంతో శాశ్వత పరిష్కారంహైదరాబాద్:ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింకు మంజూరు, కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో ఆయన వివరించారు. భద్రాచలం పట్టణానికి బైపాస్.. కరకట్ట హైవేతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చుఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి-30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం నడిబొడ్డు గుండా వెళ్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు ఏటా భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీ కలగలిసి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. 10 కిలోమీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు) ఏర్పడి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన పండుగల సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీ వాహనాలను గంటల తరబడి నిలిపివేయాల్సి రావడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం, సరుకు రవాణాకు ఆలస్యం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినా, దానికి రూ.120 కోట్ల భారీ వ్యయం అవుతుందని మంత్రి గుర్తుచేశారు. అదే భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మిస్తే కేవలం రూ.25 కోట్లతోనే పూర్తి చేయవచ్చుని, ఖర్చు తక్కువగా ఉండటమే కాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ బైపాస్‌తో దీర్ఘకాలిక ట్రాఫిక్ రవాణాకు, ముఖ్యంగా భారీ వాణిజ్య వాహనాలకు పట్టణం గుండా వెళ్లే అవసరం తప్పుతుందని, భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని, ప్రమాదాలు గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, సరుకు రవాణా మెరుగుపడి ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్-30 వ్యూహాత్మక ప్రాధాన్యతను, భద్రాచలంలో రహదారి భద్రత అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని బైపాస్ నిర్మాణానికి పరిపాలన, ఆర్థిక అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోరారు. ఖమ్మం-అశ్వారావుపేట నాలుగు వరుసలుగా మార్చాలిజాతీయ రహదారి 365బీబీలోని ఖమ్మం-అశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్-ఖమ్మం మార్గాన్ని తొలుత నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రస్తుత రహదారుల విస్తరణకు బదులు ఖమ్మం-దేవరపల్లి (365బీజీ), వరంగల్-ఖమ్మం (163జీ) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రస్తుత 365బీబీ, 563 రహదారుల విస్తరణ పక్కనపెట్టినట్లు వివరించారు. ఖమ్మం, వెంకటాయపాలెం, తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు, వైరా, పినపాక, తల్లాడ, అంజనాపురం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, గంగారం, మండలపల్లి, అశ్వారావుపేట తదితర జనావాసాల గుండా సాగే ఈ 122 కిలోమీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని, సుమారు 40 బ్లాక్‌స్పాట్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజా భద్రత, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ మార్గాన్ని కేంద్ర రహదారుల శాఖకు (మోర్త్) తిరిగి అప్పగించి, నాలుగు వరుసల పనులకు ప్రత్యేక కేసుగా పరిగణించి మంజూరు చేయాలని కోరారు. ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కిలోమీటర్ల లింకు. గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంతో ఖమ్మం పట్టణానికి పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ దిశల్లో బైపాస్ ఏర్పడిందని, సూర్యాపేట-ఖమ్మం నాలుగు వరుసల రహదారి, ఖమ్మం-కురవి (365ఏ) పనులతో ఉత్తర భాగం కూడా పూర్తవుతుందని మంత్రి తెలిపారు. దీంతో ప్రతిపాదిత ఖమ్మం ఔటర్ బైపాస్‌లో దాదాపు 80 శాతం సిద్ధమైందని, అయితే ఖమ్మం-కురవి మార్గానికి, వరంగల్-ఖమ్మం (163జీ) మార్గానికి మధ్య ఆగ్నేయ దిశలో 7 కిలోమీటర్ల కీలక అనుసంధాన లింకు మిగిలి ఉందని వివరించారు. ఖమ్మం-కురవి మార్గాన్ని అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే లింకుతో అనుసంధానిస్తే ఖమ్మం చుట్టూ నిరంతర రింగ్ రోడ్డు పూర్తిస్థాయిలో సాకారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ లింకు పూర్తయితే ఖమ్మం చుట్టూ అన్ని జాతీయ రహదారుల మధ్య నిరంతర అనుసంధానం ఏర్పడి, పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గి, రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. గత రెండు వార్షిక ప్రణాళికల్లో ఈ ప్రతిపాదన చేర్చినా నిధులు మంజూరు కాలేదని గుర్తుచేస్తూ, ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో మిగిలిన లింకుకు ప్రాధాన్యతపై పరిపాలన, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లికొత్తగూడెం, పాల్వంచలకు బైపాస్ అవసరం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల మీదుగా సాగే జాతీయ రహదారి 30, ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక పట్టణాల నడిబొడ్డు గుండా వెళ్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాల రాకపోకలతో సుమారు 23 బ్లాక్‌స్పాట్లు ఏర్పడి ప్రాణనష్టం సంభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరెల్లి - కొత్తగూడెం మధ్య ఎన్‌హెచ్-930 పూర్తయితే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కారుకొండ, సూరారం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, ఓల్డ్ పాల్వంచ, జగన్నాథపురం మీదుగా 25 కిలోమీటర్ల బైపాస్ నిర్మించి, ఎన్‌హెచ్-930పి, ఎన్‌హెచ్-30లను అనుసంధానించాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుతో రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని కోరారు.

## ఘనంగా అద్విత గ్రాండ్ హోటల్ ప్రారంభం



ములుగు జిల్లా( లోకల్ గైడ్)ములుగు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్విత గ్రాండ్ హోటల్ బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జయ శంకర్ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యేగండ్ర వెంకటరమణారెడ్డి, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్,, మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి- జగదీశ్వర్ అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ రెడ్కో చైర్మన్, వై సతీష్ రెడ్డి, తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటల్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో అభివృద్ధి సాధించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆధునిక సౌకర్యాలతో రూపొందించిన అద్విత గ్రాండ్ హోటల్‌లో లగ్జరీ రూమ్స్, సెంట్రల్ ఏసీ, లిఫ్ట్ సౌకర్యంతో పాటు కుటుంబాలకు అనువైన ఆహ్లాదకరమైన వసతి కల్పించబడింది. అలాగే ప్రతిరోజూ ఉదయం రుచికరమైన టిఫిన్స్, సౌత్ ఇండియన్ ఒ నార్త్ ఇండియన్ నోరూరించే వంటకాలు, పరిశుభ్రమైన వాతావరణంలో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని హోటల్ యాజమాన్యం తెలిపింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు, రమేష్ రెడ్డి, వేణు యాదవ్, సునీల్ కుమార్, మల్లయ్య,నర్సింహా నాయక్, ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు,, కార్యకర్తలు, హోటల్ యాజమాన్యం, వ్యాపారవేత్తలు పాల్గొని హోటల్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాలో పోస్టుల భర్తీకై దరఖాస్తుల ఆహ్వానం



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థచే నడుపబడుతున్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో తాత్కాలిక అధ్యాపకులు,ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ ఈ ఎస్ సమన్వయకర్త కోటూరి రామ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు,జూనియర్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసేందుకు తాత్కాలిక బోధనా సిబ్బంది ఎంపిక కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సైన్స్,ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు తాత్కాలిక పద్ధతిన జూనియర్ లెక్చరర్,పిజిటి,టిజిటి,స్పెషల్ టీచర్ల కొరకు ఈనెల 23న సాయంత్రం 4 గంటలలోగా లక్షెట్టిపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాలలో కార్యాలయ పని వేళలలో అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 25న జూనియర్ లెక్చరర్,పిజిటి క్యాడర్ ఖాళీలకు,27న టిజిటి,స్పెషల్ టీచర్ క్యాడర్ 2రోజులపాటు ఉదయం 9నుండి తరగతి బోధన పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్,పిజిటి పోస్టులకు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పిజి,డిగ్రీ తో పాటు బిఈడి,టిజిటి పోస్ట్ కు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బిఎస్సి,బిఎ,బి కాం,డిగ్రీ కనీసం 50శాతం మార్కులతో పాటు బిఈడి అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు,ఒక జత నకలు ప్రతులను తీసుకొని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో సకాలంలో హాజరుకావాలని తెలిపారు. బాలికల విద్యాలయాలలో పనిచేయడానికి మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

## సీతారామ జలాల మళ్లింపుపై బీఆర్ఎస్ ఆందోళన

### సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి రైతులకే ఇవ్వాలి : బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు



భద్రాద్రి జిల్లా, చర్ల : లోకల్ గైడ్ :సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతుల అవసరాలకే వినియోగించాలని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మంత్రులు సీతారామ ప్రాజెక్టు నీటిని ఖమ్మం జిల్లాకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు పరిశీలన కోసం అశ్వాపురానికి వచ్చిన నలుగురు రాష్ట్ర మంత్రులకు రైతుల తరపున శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని, ఆ హక్కును హరించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న వారి గొంతును పోలీసుల ద్వారా అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భద్రాద్రి జిల్లాకు నష్టం కలిగించే ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సీతారామ ప్రాజెక్టు నీటిని ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతుల సాగునీటి అవసరాలకే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట జూలై 16(లోకల్ గైడ్): అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ లో పీ ఎం ఎఫ్ ఎం ఈ, పీఎం విశ్వకర్మ పథకాల కింద తిరస్కరించబడిన దరఖాస్తులపై కలెక్టర్ బ్యాంకర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూఎస్‌బీఐ శాఖలలో తిరస్కరణలు అధికంగా ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను స్పష్టంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ, ఎస్‌బీఐలో మాత్రమే ఎక్కువ తిరస్కరణలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వివిధ బ్యాంకులకు కేటాయించిన పీఎం విశ్వకర్మ దరఖాస్తులను బ్యాంకుల వారీగా సమీక్షించి, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల వివరాలను ఆ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ సమావేశంలో వివరించగా, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకర్లు, ఏపీఎంలు, డీపీఎంలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి గ్యాప్‌లు లేకుండా అన్ని పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆమె సూచించారు. పీ ఎం డీ డి కే వై కార్యక్రమంపై ప్రస్తుతం ప్రత్యేక సమీక్ష జరుగుతోందని, ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారి కూడా సమీక్ష నిర్వహిస్తున్నందున, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. బ్యాంకులు ఆమోదించిన రుణాలను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేయాలని, ఆగస్టు 15 న చివరి గడువుగా నిర్దేశించినందున, అప్పటిలోగా 100 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు. అన్ని పథకాలలో లక్ష్యాలను 100 శాతం సాధించే దిశగా బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్త్రీ నిధి రుణాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను కూడా క్రమం తప్పకుండా సమీక్షించి, పురోగతిని వేగవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీ ఆర్డీ ఓ వెంకట్ రాములు, ఎల్ డీ ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, మున్సిపాల్టీ కమిషనర్ శంకర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులో అనుకూల పంటలు సాగు చేయాలి

జాన్ సుధాకర్




నారాయణపేట జూలై 16(లోకల్ గైడ్):వర్షాభావ పరిస్థితుల్లో అనుకూల పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ తెలిపారు.గురువారంనారాయణపేట మండలం ఏ క్లాస్ పూర్ గ్రామంలో ఎల్ నీనో వాతావరణ పరిస్థితులు, రైతులకు అవగాహన, ప్రత్యామ్నాయ పంటల పైన అవగాహన కార్యక్రమము నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ పాల్గొని రైతులకు సూచనలు ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో బోర్ల కింద వరి సాగు చేసే రైతులు వరి విస్తీర్ణాన్ని తగ్గించుకుని ఆరుతడి పంటలైన నువ్వులు, ఆముదము, సజ్జలు, జొన్న, రాగులు, చిరుధాన్యాల పంటలు సాగు చేయాలని, తక్కువ నీటితో పంటలు పండించుకోవచ్చని తెలిపారు. పత్తి పంటలు వర్ష బావ పరిస్థితిలో ఉన్న నేపథ్యంలో వడలి పోయే పరిస్థితి ఉన్నందున పైపాటుగా ఎరువులు యూరియా రెండు శాతం స్ప్రే చేసుకోవాలని రైతులకు తెలియజేయడం జరిగిందన్నారు, రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దినకర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్ , గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, రామ్ రెడ్డి, తిమ్మప్ప, ఆనంద్, మహేష్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలి

అదనపు ఎస్పీ రియాజ్



నారాయణపేట జూలై 16:అవార్డులు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని వారిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని నారాయణపేట అదనపు ఎస్పీ రియాజ్ అన్నారు.గురువారం నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన టాపర్లకు, అలాగే ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకొని టీటీసీ లో ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ ఎస్పీ రియాజ్, విచ్చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా అధికారి,సుదర్శన్ రావు విద్యార్థులకు పురస్కారాలు,ప్రోత్సాహం బహుమతుల ప్రదానం చేశారు.కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రవీందర్ లకావత్ విద్యార్థులకు మెమెంటోలు, ప్రత్యేక బహుమతులను అందజేసి అభినందించారు.విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితం లో స్థిరపడాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహక బహుమ తులను అందించడం జరిగిందని తెలిపారు. సన్మానం పొందిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని, తోటి విద్యార్థు లు కూడా రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో మరియు పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకుంటే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వక్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ ది కీలక జిల్లా కలెక్టర్ ప్రియాంక.




నారాయణపేట జూలై 16:గ్రామీణాభివృద్ధి, వ్యవసా యాభివృద్ధి సమగ్ర సామా జిక-ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృ ద్ధికి అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రీఫైనాన్సింగ్, రైతులకు ఆర్థిక సహాయం, మహిళా సంఘాలకు ఫైనాన్షియల్ సపోర్ట్, నేచురల్ ఫార్మింగ్ ప్రోత్సాహం వంటి అనేక రంగాల్లో నాబార్డ్ ఎంతో విశేషమైన సేవలు అందిస్తోందన్నారు. నా బార్డ్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో కూడా నాబార్డ్ ఇటీవల తన కార్యకలాపాలను మరింత విస్తరించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. మనలాంటి గ్రామీణ జిల్లా అభివృద్ధికి నాబార్డ్ వంటి సంస్థలు చేరువ కావడం ఎంతో అవసరం అని తెలిపారు.స్వయం సహాయక సంఘాల సభ్యులు నాబార్డ్ అందిస్తున్న అభివృద్ధి అవకాశాలు, పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని తమ జీవనోపాధిని మరింత మెరుగుపరచుకోవాలని ఆమె సూచించారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్థలు ఉన్నప్పటికీ, గత 45 సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలకు నమ్మకమైన భాగస్వామిగా నాబార్డ్ సేవలందిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఏ సమావేశం జరిగినా, జిల్లా కలెక్టర్ పిలుపు వచ్చిన వెంటనే స్పందిస్తూ, "మేము సిద్ధంగా ఉన్నాం అవసరమైతే డీపీఆర్‌లు తయారు చేస్తాం మా వద్ద నిధులు ఉన్నాయి జిల్లాకు అవసరమైన సహకారం అందిస్తాం" అనే సానుకూల దృక్పథంతో నాబార్డ్ అధికారులు ఎప్పుడూ ముందుంటున్నారని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సహకారం మరింత బలపడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తు న్నానని అన్నారు. ముఖ్యంగా మన జిల్లా మహిళలకు నా బార్డ్ సంస్థలు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, మనం కూడా ముందుకు రావాలని, మనం ఏం చేయగలం? మన గ్రామాల్లో ఏ అవకాశాలు ఉన్నాయి? ఏ వ్యాపారాలు ప్రారంభిం చవచ్చు? అనే విషయాల్లో ధైర్యంగా ముందుకు రావాలని మహిళా సంఘాల సభ్యులకు ఆమె సూచించారు. సంఘాలతో నిరంతరం అనుసంధా నంగా ఉండాలని, రుణం తీసుకోవడమే కాకుండా ఆ రుణాన్ని సరైన విధంగా ఉపయోగించి మరింత ఆదాయం వచ్చేలా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, ఇతర అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకో వాలని చెప్పారు. నా బార్డ్ అందించబోయే ప్రెజెంటేషన్‌లో కూడా ఈ అంశాల గురించి వివరంగా తెలియజేస్తారనీ, అందరూ శ్రద్ధగా విని, ఎలాంటి సహాయం అవసరమైనా నాబార్డ్ సంస్థ ద్వారా, అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తాము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం "కోటి మంది మహిళలను కోటీశ్వరు లుగా తీర్చిదిద్దాలి" అనే లక్ష్యంతో పనిచేస్తోందనీ, అలాగే నారాయణపేటను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దా లని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నా రని, ఆ మహత్తర లక్ష్య సాధనలో నాబార్డ్ తన సహకారం, మార్గదర్శక త్వాన్ని మరింతగా అందించాలని, ఆ లక్ష్య సాధనలో మనమందరం భాగస్వాములు కావాలని రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో, చురుకుదనంతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం స్వయం సహాయక సంఘాల బలోపేతం మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధి విజయ గాథల గురించి ట్రైనీ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీ ఆర్డీవో వెంకట్ రాములు, నాబార్డు డీ డీ మహేందర్ బాబు, ఎల్ డి ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సాయిబాబా, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారి అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీ పీ ఎం లు, ఏ పీ ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు: సీఐ శివశంకర్




నారాయణపేట జూలై 16:జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ పోలీసులతో కలిసి బస్టాండ్, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలుచేపడుతోందన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదావినియోగానికి పాల్పడే వారిపైచట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థా లకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలా పాలు గమనించినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించా లని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబ డతాయని తెలిపారు.అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. నారాయణ పేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే బస్టాండ్ ఏరియాలో అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో పోలీసు జాగిలం విక్కీ, పిసి పరమేశ్, టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాయల చంద్రశేఖర్ ఆశయాలనుకొనసాగిద్దాం ఎం.హన్మేష్ చారి



నారాయణపేట జూలై 16: ఎలాంటి అంతరాలు లేని సమ సమాజం రావాలని తన జీవితాంతం కృషి చేసిన సిపిఐ(ఎమ్ ఎల్)మాస్ లైన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.హన్మేష్ పిలుపునిచ్చారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సందర్భంగా స్థానిక భగత్ సింగ్ భవన్ లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల తో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హన్మేష్ మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తో స్ఫూర్తి పొంది, మనదేశంలో రైతాంగం భూస్వాముల చేత, కార్మిక వర్గం పెట్టుబడిదారుల చేత అనునిత్యం దోపిడీకి గురి అవుతున్నదని ఈ అన్యాయాలకు, అక్రమాలకు శ్రమ దోపిడికి వ్యతిరేకంగా పోరాడాలని తన చిన్న వయసులోనే నిర్ణయించుకున్నాడన్నారు. తన చదువును కూడా మధ్యలో వదిలేసి ఉద్యమం బాట పట్టాడనీ ఈ క్రమంలో రాజ్యం చేత అనేక నిర్బంధాలు, ప్రయివేటు గుండాల చేత బెదిరింపులు ఎదుర్కొన్నాడన్నారు. అయినా ఎక్కడ చలించకుండా పేదల కోసం, కార్మిక వర్గం కోసం తన జీవితాన్ని అంకితం చేశాడనీ తెలిపారు. పార్టీని ముందుకు తీసుకెళ్లడం లో తన వంతు కృషి చేశాడనీ అటువంటి వ్యక్తిని మనమందరం స్ఫూర్తి గా తీసుకోని సమసమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు సలీం, కె. కాశినాథ్, బోయిన్ పల్లి రాము, ఎస్. కిరణ్ బి.యాదగిరి, పి.రామకృష్ణ, బి. నర్సింహా, భగవంతు, కొండ నర్సిములు, ఛన్నారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం...




లోకల్ గైడ్: ఖమ్మంరాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన కానిస్టేబుల్ ను అభినంధించిన పోలీస్ కమిషనర్‌రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మూడు పతకాలు సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. హైదరాబాద్ లో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్-- 2026లో పిల్లి రాజు, వుషూ -- స్వర్ణ పతకం రెజ్లింగ్ -- రజత పతకం, కెన్‌కెన్ సిలాట్ -- కాంస్య పతకాలు సాధించారు.అదేవిదంగా జూలై 12న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ 9గంటల 31నిముషాలు 31సెకండ్ ల లో విజయవంతంగా పూర్తి చేశారు.

## ట్రాలీ బోల్తా.. 22 మందికి గాయాలు

**బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించిన సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్**

**కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**



మణుగూరు : లోకల్ గైడ్ :పినపాక మండల పరిధిలోని అక్కినపల్లి మల్లారం--మూలమలుపు మార్గంలో గురువారం ఉదయం కూలి పనులకు వెళ్తున్న కూలీలతో ప్రయాణిస్తున్న ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడటంతో పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో 22 మంది కూలీలు గాయపడగా, సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మణుగూరు ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న వెంటనే మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముత్తేనేని గౌరీ ప్రసాద్ స్వయంగా అత్యవసర విభాగానికి చేరుకుని వైద్య బృందాన్ని అప్రమత్తం చేశారు. గాయపడిన ప్రతి ఒక్కరికీ తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. డాక్టర్ గౌరీ ప్రసాద్ చొరవతో ఎలాంటి ఆలస్యం లేకుండా చికిత్స ప్రారంభం కావడంతో బాధితుల కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల సేవా దృక్పథానికి నిదర్శనమని పలువురు అభినందించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.. పీహెచ్‌సీల్లో మందులు, పరికరాలు సిద్ధంగా ఉంచండి: కలెక్టర్ కె. హైమావతి



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 16: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.పీహెచ్‌సీ పరిధిలోని యూపీహెచ్‌సీల ద్వారా ఏఎన్‌ఎంలు, సూపర్వైజర్లు ప్రజల్లో సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు, సెలవు వివరాలను పరిశీలించి రోజువారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందాలని, వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. అలాగే పోషకాహారం తీసుకోవడం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.

## మెను ప్రకారం భోజనం అందించని కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలి...




బెల్లంపల్లి (లోకల్ గైడ్)బెల్లంపల్లి100పడకల హాస్పిటల్ లో మెనూ ప్రకారం భోజనం అందించని అందజేయని సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఎంసిపిఐ యు జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికి గురువారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గోడలకే మెను పరిమితం చేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని,వేరే కాంట్రాక్టర్ ను మార్చాలని డిమాండ్ చేశారు.7మండలాల నుండి ఎంతోమంది ప్రజలు వస్తు పోతూ ఉంటారనీ,కాంట్రాక్టర్ మెను ప్రకారం ఉదయం అల్పాహారం ఇవ్వడం లేదని,ఇడ్లీ,పొంగల్,ఉప్మా,బ్రెడ్ ముక్కలు,కాచిన పాలు,మెనూలో మధ్యాహ్నం భోజనంలో కోడిగుడ్డు అరటిపండు,పెరుగు ఉన్నా కూడా ఆసుపత్రిలో ఉన్న రోగులకు అందించకపోవడం బాధాకరం అని పేర్కొన్నారు.ఇప్పటికైనా వివిధ మండలాల నుండి వస్తున్న రోగులకు,అల్పాహారం,మధ్యాహ్నం భోజనంలో కోడిగుడ్డు అరటిపండు పెరుగు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలి

**కారేపల్లి కేజీబీవీని సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం**



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 16 :విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం అన్నారు. కారేపల్లి లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డిఇఓ గురువారం సందర్శించారు. పదవ తరగతి విద్యార్థినిలతో డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, పాఠశాల దశలోనే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణం గా పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనవసరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా చదువుపై దృష్టి సాధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం తయారు చేసే సిబ్బంది కి సూచనలు చేశారు. మండలంలోని విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. దుస్తుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా వచ్చేవారం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ బాజోజు ప్రవీణ్ కుమార్ , కేజీబీవీ సిఆర్టీ లు ఝాన్సీ , సమీనా , తదితరులు పాల్గొన్నారు.

## "బూర్గుల భవితకు బంగారు బాట వేసిన శంకర్ అన్న" "రూ.25 లక్షల అభివృద్ధి నిధులు.. బూర్గులకు శుభదినం"

"తొలి విడతగా రూ.8 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం"

"బూర్గుల రూపురేఖలు మారుస్తున్న శంకరన్న నాయకత్వం: రాయికల్ శ్రీనివాస్"

( లోకల్ గైడ్ షాద్ నగర్ )బూర్గుల గ్రామానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న మంజూరు చేసిన రూ.25 లక్షల అభివృద్ధి నిధుల్లో భాగంగా రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బూర్గుల గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్ భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఎమ్మెల్యే శంకరన్న ప్రత్యేక చొరవతో బూర్గుల గ్రామానికి వరుసగా అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఇటీవల బూర్గుల గ్రామానికి సుమారు రూ.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో కూడిన భారీ ప్రభుత్వ హైస్కూల్ మంజూరు కానుండడం గ్రామ అభివృద్ధిలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే శంకరన్నకు గ్రామ ప్రజల తరపున, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.బూర్గుల గ్రామానికి రానున్న రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి పనులు, అదనపు నిధులు తీసుకువచ్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని రాయికల్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ...తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారు జన్మించిన బూర్గుల గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇతర గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేసినప్పటికీ, బూర్గుల రామకృష్ణారావు గారి సొంత గ్రామంలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు.అలాగే,గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ...బూర్గుల గ్రామ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు రూ.25 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్ గారికి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బాలరాజు గౌడ్, సర్పంచ్ల సంఘం ప్రెసిడెంట్ ర్యాకల శ్రీనివాస్, బూర్గుల సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, విలేజ్ ప్రెసిడెంట్ నర్సింలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సర్పంచు శివలీల, వార్డు సభ్యులు కవిత, సత్యనారాయణ, స్వప్న, రాజారాం, పవన్ కుమార్, సంతోష్ గౌడ్, హరీశ్వర్, శేఖర్, జంగమ్మ , మాజీ సర్పంచులు శివ కుమార్, పరుశురాం, గ్రామస్తులు జంగయ్య , నర్సింగ్, వినోద్ గౌడ్, నాగరాజ్, శివకుమార్, కిషన్ నగర్ సర్పంచ్ నరసింహులు చౌలపల్లి సర్పంచ్ జంగయ్య, ఉప్పరగడ్డ సర్పంచ్ చందు నాయక్, దేవునిపల్లి సర్పంచ్ మల్లేష్, కమ్మదనం నవీన్, అన్నారం సర్పంచ్ రామకృష్ణ, అన్నారం మాజీ సర్పంచ్ రాములు గౌడ్, మట్ట వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు శ్రీశైలం ముదిరాజ్, శ్రీశైలం, రాజు, ఎలికట్ట డిప్యూటీ సర్పంచు అభినవ్, అయ్యవారిపల్లి భరత్ రెడ్డి, పుల్లారెడ్డి, లింగారెడ్డి గూడ డిప్యూటీ సర్పంచు అశోక్, కడియాలకుంట మాజీ సర్పంచ్ రాజు నాయక్, చించోడ్ బాబా,
లయాక్ భాయ్, రాజు, బసప్ప, సద్దుల ఆంజనేయులు, భారత్, వినయ్, సందీప్, శేఖర్, దాస్య నాయక్ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయాల కట్టడికి విస్తృత తనిఖీలు

ఎస్పీ సునీల్ దత్



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్ జులై 16 : ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వివిధ దుకాణాలలో గంజాయిని చాక్లెట్లు, సిగరెట్, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు గురువారం కారేపల్లి, ఖమ్మం టౌన్, కూసుమంచి పోలీస్ స్టేషన్ల పరిధిలో కిరాణా దుకాణాలు, పాన్‌డబ్బాలలో తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయి హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు ముసుగులో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పోలీసులు పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

# హిట్ అండ్ రన్ కేసు ఛేదించిన పోలీసులు...




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ఈనెల11న రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా నజీర్‌పల్లి వంతెన వద్ద రహదారి దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతు శుక్రవారం రాత్రి మృతి చెందారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన జైపూర్ పోలీసులు హిట్ అండ్ రన్ కేసును ఛేదించారు.ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సిఐ నవీన్‌కుమార్,ఎస్ఐ భూమేష్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి,సీసీ కెమెరాల దృశ్యాలు,సాంకేతిక ఆధారాలు,స్థానిక సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రమాద సమయంలో బస్సు ఆసిఫాబాద్ నుంచి గోదావరిఖని వైపు ప్రయాణిస్తుందని విచారణలో తన తప్పిదాన్ని ఒప్పుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని ఎస్ఐ తెలిపారు.దర్యాప్తులో ప్రమాదానికి కారణమైన వాహనం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన టిఎస్20 జడ్ 0012 నంబర్ గల ఆర్టీసీ బస్సుగా గుర్తించారు.బస్సు డ్రైవర్‌ను బెజ్జూర్‌కు చెందిన జంగిటి రాజేశ్‌గా గుర్తించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుత్ శాఖ ఉద్యోగులకు
## పి ఆర్ సి పెన్షన్ రివిజన్ విధానాన్ని వెంటనే అమలు చెయ్యాలి

రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

నారాయణ పేట జులై 16లోకల్ గైడ్ ):విద్యుత్ శాఖ ఉద్యోగులు 24 గంటలు ఏడు రోజులు నిరంతరం ప్రమాద కర పరిస్థితి లలో పనిచేస్తారని వారికీ వేతన పెన్షన్ సర్దుబాటు సమస్య లు పరిష్కరించాలని 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా డిమాండ్ చేశారు, గురువా రం మరికల్ మండల కేంద్రం లో జరిగిన 1104 యూనియన్ సమావేశం లో అయన పాల్గొన్నారు, అనంతరం విద్యుత్ కార్మికుల తో కలసి విలేక రుల తో మాట్లాడారు ,నేడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా జన్మదినాని పురస్కరించుకొని కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా కార్మికులు గిరిదర్ గౌడ్ సాయిబాబా కు శాలువా తో సన్మానం చేశారు, ఈ కార్యక్రమం లో గోవింద్ రాజు రఘు శ్రీధర్ రెడ్డి మొగులప్ప మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని క్లినిక్?లపై వైద్యశాఖ దాడులు...

నాలుగు దవాఖానాలు సీజ్




నిజామాబాదు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 16: నిజామాబాద్? నగరంలో అనుమతిలేని క్లినిక్?లపై జిల్లా వైద్యశాఖ కొరడా ఝులిపించింది. జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నలుగురు పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్?లను సీజ్? చేసింది. 4 వ పోలీస్ టౌన్? పరిధిలోఅక్రమంగా నడుపుతున్న పలు క్లినిక్ ల పై డీఎంహెచ్?వో రాజశ్రీ ఆదేశానుసారం వైద్యురాలు సుప్రియ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గతంలో జిల్లాలో పీఎంపీ,ఆర్?ఎంపీలు నిర్వహిస్తున్న




క్లినిక్?లను తనిఖీ చేశారన్నారు. అర్హతకు మించి వైద్యం చేయడం.. యాంటీబయాటిక్స్ ఇష్టానుసారంగా రోజులకు ఇవ్వడాన్ని పరిశీలించిన కౌన్సిల్ సభ్యులు సంబంధిత క్లినిక్?లు నిర్వహిస్తున్న వారికి నోటీసులు సైతం గతంలో జారీ చేశారు. అనంతరం వారిపై ఎఫ్?ఐఆర్?లు కూడా నమోదయ్యాయి. ఈ సందర్భంగా మెడికల్ కౌన్సిల్ నుంచి జిల్లా వైద్య శాఖకు అందిన ఆదేశానుసారం గురువారం 4 క్లినిక్?లను వైద్యాధికారులు సీజ్ చేశారు. 4వ టౌన్ ఎస్ఐ కరీం ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా క్లినిక్?లకు చేరుకొని సీజ్ చేస్తున్నట్లుగా నోటీసులు అంటించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, రామకృష్ణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్నగర్ టౌన్ లోని కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాబృంద సభ్యులు సాంస్కృతిక రూపంలో సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు,బాల్యవివాహాల ముప్పులు,రోడ్డు ప్రమాదాలు నివారణ,చట్టం శాంతి భద్రత,మహిళల భద్రత,గుడ్ టచ్ బ్యాడ్ టచ్,హెల్ప్‌లైన్ నంబర్లు 1930,100,1098 వినియోగం వంటి ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.క్రమశిక్షణ,నైతిక విలువలు,సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ టౌన్ ఎస్ఐ రాజు,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రమాదేవి,కళాబృందం సభ్యులు రోహిత్,రాంచందర్,శ్రీనివాస్,చంద్రశేఖర్,రజిత,సంఘవి విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

సీతమ్మసాగర్--సీతారామ ప్రాజెక్టులు
త్వరితగతిన పూర్తి చేస్తాం
భట్టి, ఉత్తమ్, పొంగులేటి
ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో
పరిశీలించిన మంత్రుల బృందం





భద్రాద్రి జిల్లా, అశ్వాపురం : లోకల్ గైడ్ (జిల్లా బ్యూరో) : ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందించేందుకు సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు పరిధి, పూర్తయిన మరియు పెండింగ్ పనులపై అధికారులు సాంకేతిక వివరాలు అందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రావిటీ, లిఫ్ట్ ఇరిగేషన్ విధానాల ద్వారా నీటిని అవసరమైన ప్రాంతాలకు చేరవేసే ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే భారీగా ప్రజాధనం వ్యయం అయిన నేపథ్యంలో మిగిలిన పనులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు జీవనాడి లాంటిదని పేర్కొన్నారు. ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు, బ్యారేజ్, కాలువలు, విద్యుత్ అనుసంధానం వంటి పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా నీటి వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ పనుల కోసం రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసిందని తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రాజెక్టు పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం తదితర అంశాలపై మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను కూడా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను
# యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

సీతారామ, ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల
భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి
భూసేకరణకు అవసరమైన నిధులు వెంటనే
విడుదల చేసి చెల్లింపులు చేస్తాం యాతాలకుంట
టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం,
మంత్రులు



సత్తుపల్లి, జూలై - 16:లోకల్ గైడ్ :సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు.అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు.తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టులో



గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకే హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వ విధానం ప్రకారం వేగంగా చెల్లింపులు చేయాలని నిర్ణయించామని, జిల్లా కలెక్టర్లు, అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు.టీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేశారని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వడం లేదని అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు.నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ, సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు.జూలై నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చలు జరిపి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయా యని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయా యని, సీతారామ ప్రాజెక్టుపై రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం ఆవిష్కరణ పోస్టర్ ను విడుదల చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

టీజేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 19న అమరవీరుల స్తూపం ఆవిష్కరణ



( లోకల్ గైడ్ షాద్ నగర్ )రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎంపీడీవో కార్యాలయం ఆవరణ తెలంగాణా జాయింట్ యాక్షన్ కమిటీ( టి జేఏసీ) వారి ఆధ్వర్యంలో 19వ తేదీన నూతనంగా ఏర్పాటు చేసిన తెలగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ పోస్టర్ విడుదల చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్,మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, గిరిజన ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్,శేఖర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి రవి కుమార్ గుప్తా, అంబటి ప్రభాకర్,దంగూ శ్రీనివాస్ యాదవ్, జాంగారి రవి,జేఏసీ నేతలు జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ.కరణకర్, నక్క బాలరాజు,టీజీ శ్రీనివాస్, బిస్వ కృష్ణయ్య, రవీంద్ర నాథ్, అర్జునప్పా,మందారం నర్సింహులు, గొర్ల రాము, పరం జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

## రైతుల సమస్య పరిష్కారమైంది" పసుపుల ప్రశాంత్ కు ఎమ్మెల్యే శంకర్ అన్నా ఫోన్

చెట్ల నీడలో రైతులతో కూర్చొని 100 ఎకరాల సమస్యకు పరిష్కారం చూపిన శంకరన్న

8 ఏళ్ల రైతుల గోసకు ముగింపు పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

త్వరలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , కలెక్టర్ చేతుల మీదుగా పట్టా పాసుపుస్తకాలు ఇస్తామని హామీ



( లోకల్ గైడ్ షాద్ నగర్ )8 సంవత్సరాల రైతుల గోసకు శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి లక్ష్మీదేవునిపల్లి రైతుల ప్రత్యేక కృతజ్ఞతలురంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామ రైతులు దాదాపు ఎనిమిది సంవత్సరాలుగా =ూ= పెండింగ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 100 ఎకరాల వ్యవసాయ భూములు రికార్డుల సమస్యలో చిక్కుకుపోవడంతో రైతుల జీవితాలుఅస్తవ్యస్తమయ్యాయి.తమ సొంత భూమి ఉన్నప్పటికీ పట్టాదారు హక్కులు పూర్తిగా వినియోగించుకోలేక రైతులు అనేక కష్టాలను అనుభవించారు. 10 గుంటల భూమి అమ్ముకుని ఇల్లు నిర్మించుకుందామన్నా సాధ్యం కాలేదు. కుమార్తెల పెళ్లిళ్లు చేయడానికి భూమి అమ్ముదామని అనుకున్నా వీలు కాలేదు. బ్యాంకుల్లో రుణాలు తీసుకోలేకపోయారు. వ్యవసాయానికి పెట్టుబడి సమకూర్చుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. పిల్లల చదువుల కోసం అవసరమైన డబ్బు సమకూర్చుకోలేకపోయారు. కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యకు పరిష్కారం లభించలేదు.ఈ సమస్యను గతంలో పలువురు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా, మాజీ ఎమ్మెల్యేకు కూడా రైతులు సమస్యను వివరించినప్పటికీ పరిష్కారం కాలేదు. దీంతో రైతులు నిరాశలోనే కాలం గడిపారు.అయితే ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న వీర్లపల్లి శంకర్ గారికి ఈ విషయం తెలియగానే, తనకు ఎన్నో అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి స్వయంగా లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి వచ్చి, రైతుల మధ్య చెట్ల నీడలో కూర్చొని అధికారులతో ప్రత్యక్షంగా చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకోవడం రైతుల హృదయాలను గెలుచుకుంది.రైతుల బాధను తన సొంత బాధగా భావించి, అక్కడికక్కడే అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడంతో పాటు, పసుపుల ప్రశాంత్ కుమార్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు స్వయంగా ఫోన్ చేసి, "రైతుల సమస్యకు పరిష్కారం లభించింది. త్వరలోనే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని హామీ ఇచ్చినట్లు పసుపుల ప్రశాంత్ కుమార్ తెలిపారు.ఇన్నేళ్లుగా పరిష్కారం కాని సమస్యను ప్రజల వద్దకే వచ్చి, వారి మధ్య కూర్చొని, మానవత్వంతో స్పందించి పరిష్కార మార్గం చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి సేవలను లక్ష్మీదేవునిపల్లి గ్రామ రైతులు జీవితాంతం గుర్తుంచుకుంటారు.రైతుల తరపున ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, రైతుల సమస్యలను ఇంత చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్న ఆయన మరెన్నో ప్రజాసేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని గ్రామ రైతులందరూ ఆకాంక్షించారు.

## డిగ్రీ పీజీ కళాశాలలో అందుబాటులో ఏఈబిపి కోర్సులు.




బెల్లంపల్లి (లోకల్ గైడ్)ఎన్ని డిగ్రీలు చదివినా ఒక్క ఉద్యోగం కూడా రాని ప్రస్తుత పరిస్థితుల్లో డిగ్రీ చదువు పూర్తికాకముందే ఉద్యోగానికి సంబంధించిన శిక్షణతో పాటు ఇలా డిగ్రీ పూర్తికాగానే అలా ఉద్యోగాన్ని అందించే అద్భుత అవకాశాన్ని కల్పిస్తోందని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల అని కారణం కళాశాలలో అందిస్తున్న ఏఈడిపి డిగ్రీ కోర్సులే అని కళాశాల ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్ తెలిపారు. అవును ఇది నిజం. ఇది నిజంగా నిజం. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగిన అద్భుతం ఏఈడీపీ కోర్సులలో ఉందని ఒకప్పుడు నగర ప్రాంతాలలో మాత్రమే అందుబాటులో ఉన్న ఏఈడిపి డిగ్రీ కోర్సులు ఇప్పుడు మన బెల్లంపల్లిలోనే లభిస్తుండడం విశేషం అని,ఈ ప్రాంత బడుగు,బలహీన,వెనుకబడిన,పేద విద్యార్థుల పాలిట వరం అని పేర్కొన్నారు.బీఏ ఆనర్స్,బీకాం బిఎఫ్ఎస్ఐ,బీకాం ఈ కామర్స్,బీఎస్సీ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్,బీఎస్సీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్ కోర్సులు విద్యార్థుల పట్ల అద్భుతంగా ఓ వరంలా అందుబాటులో ఉన్నాయని అన్నారు.బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో అందిస్తున్న ఏఈడిపి కోర్సులలో చేరి ఈ ప్రాంత విద్యార్థులు ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపల్ పిలుపునిచ్చారు.వివరాలకు 9959269975 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

## వరంగల్ లో అట్టహాసంగా వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్




హనుమకొండ టౌన్,జూలై(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ హంటర్ రోడ్ లోని మాస్టర్ జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ అట్టహాసంగా జరిగింది.... కూడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించారు.. పలువురు సామాజికవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అన్నీ వర్గాల ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థుల కేరింతల నడుమ ట్రైలర్ అండ్ సాంగ్స్ రిలీజ్ చేశారు.. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన ఆడబిడ్డ కోమలి మహేందర్ సాహసోపేతంగా ధైర్యం చేసి కుటుంబ నేపద్యమున్న సినిమా తీయడంతో వారిని శాలువతో సుందర్ రాజ్ యాదవ్ సన్మానించి అభినందనలు తెలిపారు.... ట్రైలర్, సాంగ్స్ రిలీజ్ చేసిన అనంతరం మాజీ కూడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్,వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ నిర్మాత కోమలి మహేందర్ మీడియా సమావేశం నిర్వహించారు..జానపద కళాకారునీ, సారంగదరియా పాటపాడిన కోమలి సినిమా తీయడం గర్వకారణమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు...వరంగల్ ఆడబిడ్డ తీసిన వెంకట్రామయ్య గారి తాలూకా మూవీనీ అందరూ ఆదరించాలన్నారు...వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ విజయవంతం చేసే బాధ్యత వరంగల్ ప్రజల పైన ఉందనీ, మంచి కుటుంబనేపథ్యం ఉన్న వెంకట్రామయ్య గారి తాలూకా మూవీని ఆదరిస్తారని ఆశిస్తున్నానన్నారు..పిల్లల ఆశయాల గురించి ఒక తండ్రి తపనపడే మెసేజ్ తో పాటు ఒక రైతు కష్టం, భూమి విలువ ఈ మూవీలో తెలుస్తుందన్నారు...కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ చూసి వరంగల్ ఆడపడుచును ఆదరించాలని కోరారు....వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ నిర్మాత కోమలి మహేందర్ మాట్లాడుతూ.... ఈ సినిమా కోసం పెద్ద సాహసం చేశానని,కోమలి క్రియేషన్ బ్యానర్ తో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ తీసానన్నారు...చాలా మంచి ఫ్యామిలీ సినిమా,కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే మెసేజ్ తో ప్రేమకథ చిత్రాన్ని తీయడం జరిగిందన్నారు...ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా గర్వంగా చూడవలసిన సినిమా అన్నారు...ప్రతి ఒక్కరు వెంకట్రామయ్య గారి తాలూకా సినిమా చూసి విజయవంతం చేయాలన్నారు. జూన్ 17న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 60 థియేటర్ల తో పాటు హనుమకొండ లోని శ్రీదేవి ఏషియన్ మాల్, కాజీపేట భవాని థియేటర్లలో రిలీజ్ కానుందనీ తెలిపారు..వరంగల్ ఆడబిడ్డ చేసిన ఈ ప్రయత్నాన్ని గెలిపిస్తారని మనసారా ఆశిస్తున్నానన్నారు..ఒక ఆడపిల్ల కన్నీటి కథ, ఒక తండ్రి పడే ఆవేదన సన్నివేశాలతో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ ఉంటుందనీ చెప్పారు..మాస్టర్ జీ కళాశాల వేదికగా గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించినందుకు సుందర్ రాజ్ యాదవ్ కి నిర్మాత కోమలి మహేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాస్టర్ జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల జనరల్ సెక్రెటరీ అచ్యుత్ రాజ్,ఓబిసి ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ అధ్యక్షుడు గంగాపురం వేణు మాధవ్ గౌడ్, ఓబిసి సభ్యురాలు చిగుమల్ల మౌనిక, ప్రముఖ అడ్వకేట్ బండా వివేకానంద, పారిశ్రామికవేత్త గుండా శ్రీనివాస్, అధ్యాపకులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరుల తొలి బోనం జాతరకు బయల్దేరిన కుమ్మరి సంఘం



( లోకల్ గైడ్ షాద్ నగర్ )హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద శ్రీ కనకాల కట్ట మైసమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కుమ్మరుల తొలి బోనం జాతరకు షాద్నగర్ నియోజకవర్గం కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికూడ శ్రీశైలం మరియు ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో శ్రీ కనకాల కట్ట మైసమ్మ బోనాలకు బయలుదేరిన షాద్నగర్ కుమ్మరి సంఘం నేతలు మరియు మహిళలు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షులు జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కాసిరెడ్డి గూడలో అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ రామలింగం గౌడ్



( లోకల్ గైడ్ షాద్నగర్ )రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండలం కాశిరెడ్డిగూడెం లో గురువారం అండర్ డ్రైనేజీ పనులకు గ్రామ సర్పంచ్ రామలింగం గౌడ్ ప్రారంభించారు. దాదాపు 5 లక్షల వ్యాయంతో ఈ అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ రామలింగం గౌడ్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధి తమ ముఖ్య లక్ష్యం అని కాశిరెడ్డిగూడ గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతా అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామలింగం గౌడ్ మరియు గ్రామ పంచాయతీ సెక్రటరీ మరియు వార్డు సభ్యులు మాజీ గ్రామపంచాయతీ ప్రతినిధులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కాశిరెడ్డిగూడ అంగన్వాడి విద్యార్థులకు దుస్తులు పంపిణీ పాల్గొన్న గ్రామ సర్పంచ్ రామలింగం గౌడ్



( లోకల్ గైడ్ షాద్ నగర్ ) ఫరూక్నగర్ మండలం కాశిరెడ్డిగూడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థులకు అంగన్వాడి డ్రస్సులు పంపిణీ కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ రజిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ రామలింగం గౌడ్ పాల్గొని విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామలింగం గౌడ్ మరియు గ్రామ సెక్రెటరీ అంగన్వాడీ టీచర్ రజిత మరి వార్డు సభ్యులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎటువంటి బేషజాలు లేకుండా సీతారామ పనులు పూర్తి చేస్తాం : మంత్రి పొంగులేటి



సత్తుపల్లి:లోకల్ గైడ్ :సత్తుపల్లి : సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... తమ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరించారు.అనంతరం ఈ సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే టోకెన్లు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. పనుల వేగాన్ని బట్టి ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు దివాకర టిఎస్, అంకిత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ల పై అత్యాచారాలు, దౌర్జన్యాలు జరిగితే త్వరగా ఎఫ్. ఐ.ఆర్ చేసి చార్జి షీట్ వేయాలి

--- గత ఆరు సంవత్సరాల నుంచి ఒక్క ఎస్సీ ఎస్టీ కేసు నేరారోపణ జరగకపోవడం విచారకరం.

--- ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే పోలీసులు, రెవెన్యూ శాఖ అండగా ఉంటారు అనే భరోసా కల్పించాలి ..

--- నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలి.

---- జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఆదర్శ సురభి..

--- వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగింది ...

--- అదనంగా వసతి గృహాలు మంజూరు చేయాలి .

--- స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి..

వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 16.: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాధ్యమైనంత త్వరగా కేసు నమోదు చేసి దోషులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొనగా నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో 2018 నుంచి నమోదు అయిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి విచారణ, ప్రస్తుతం కేసు ఏ స్థాయిలో ఉన్నాయి, బాధితులకు అందిన పరిహారం పై ఒక్కో కేసు వారిగా సమీక్ష నిర్వహించారు. 2025 నుండి 2026 వరకు విచారణలో ఉన్న 12 కేసులపై కేసు వారిగా చర్చించారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి కేసు వారిగా వాటి పురోగతి స్థితిగతులను కమిటి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ 2020 నుండి 2026 వరకు ఒక్క కేసు నేరారోపణ జరగలేదని ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. తప్పు చేసిన వారికి చట్టం ప్రకారం ఖచ్చితంగా శిక్ష పడాలని బాధితులకు న్యాయం జరగాలన్నారు. ఒకవేళ తప్పుడు కేసులు నమోదు చేస్తే విజిలెన్స్ కమిటీ సభ్యులు నచ్చచెప్పి కేసు ఉపసంహరించుకునే విధంగా చూడాలని సూచించారు. తప్పుడు కేసులు పెట్టడం, తప్పు చేసినప్పటికీ శిక్ష పడకుండా బయట దర్జాగా తిరుగుతుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. అట్రాసిటీ కేసు నమోదు అయిన వాటిని సమగ్రంగా విచారించి తగిన ఆధారాలతో ఛార్జీ షీట్ దాఖలు చేసి తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చూడాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 2020 లో నమోదు అయిన ఒక కేసు 2026లో ట్రయల్ కొరకు రావడం ఇంకా తేది ఖరారు కాకపోవడం పై విస్మయం వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశం అయ్యింది.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో భూ సమస్యలు, ఎస్సీ ఎస్టీల భూములు కబ్జా వంటి కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేకూర్చి అండగా నిలవాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతినెల పౌర హక్కుల దినోత్సవం పకడ్బందీగా నిర్వహించి ఎస్సీ ఎస్టీలకు చట్టంపై అవగాహన కల్పించి భరోసా ఇవ్వాలని అధికారులకు కమిటీ సభ్యులకు సూచించారు. సంక్షేమ శాఖల అధికారులతో ఆయా సంక్షేమ శాఖల ద్వారా మంజూరు అయిన సంక్షేమ పథకాల పై శాఖల వారిగా ఆరా తీశారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో లబ్ధి చేకూర్చే విధంగా సంక్షేమ శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా మెస్ ఛార్జీలు కాస్మోటిక్ చార్జీలు వంటివి పెంచి విద్యార్థులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తుంటే వసతి గృహాల్లో వార్డెన్లు సరిగ్గా ఉండటం లేదని, దాని పర్యావసానంగా విద్యార్థులు నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు తూడి మెగా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా తాను సైకిళ్లు, ఇతర సహకారం అందించడం వల్ల గత సంవత్సరం కంటే ఈసారి విద్యార్థుల నమోదు.శాతం గణనీయంగా పెరిగిందని, వారికి అదనంగా వసతి గృహాలు మంజూరు అయ్యేవిధంగా చూడాలని పార్లమెంట్ సభ్యులను కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసుల్లో తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలనీ అందుకు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. పౌర హక్కుల దినోత్సవం ప్రతి నెల సజావుగా నిర్వహించడం జరుగుతోందని దీనిని మరింత పకడ్బందీగా నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. అట్రాసిటీ కేసులో బాధితులకు పరిహారం అందించే విషయంలో దాదాపు 75 లక్షల రూపాయలు పరిహారం అందించాల్సి ఉన్నా నిధులు మంజూరు కాకపోవడం వల్ల పెండింగ్ లో ఉన్నాయని, నిధులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులను కోరారు. ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యుడు మాదారి భోజరాజు కొన్ని సమస్యలను కమిటి దృష్టికీ తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, షెడ్యూల కులాల సంక్షేమ అధికారి రాంజీ రావు, ఈ డి ఎస్సి కార్పొరేషన్ సిరాజుద్దీన్ , ఆర్డిఓ సుబ్రహ్మణ్యం పిడి డి ఆర్ డి ఓ ఉమాదేవి, కమిటీ సభ్యులు డి.పి ఆర్.ఓ సీతారాం, డి డబ్ల్యు ఓ సుధారాణి, సి. విశ్వం బాబు, శంకర్ నాయక్, నాగన్న, రామచంద్రయ్య, వీరప్ప మాదారి భోజరాజు, స్వచ్ఛంద సంస్థల నుండి చిన్నమ్మ థామస్, వెంకట గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# నాచారం చెరువు అభివృద్ధికి శ్రీకారం పనులు ప్రారంభించిన హైడ్రా కమిషనర్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, జూలై 16:- ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని నాచారం పెద్ద చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా శ్రీకారం చుట్టింది. 108.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ప్రారంభించారు.విశాలమైన కట్ట నిర్మాణంతోపాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని వయసుల వారు సేదదీరేలా కట్టపై కూర్చునేందుకు వీలుగా, చెరువు చెంత ప్లే ఏరియాలు, పార్కులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పిల్లల ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లు, యోగా ప్లాట్‌ఫామ్‌లను కూడా నిర్మిస్తున్నారు. మొత్తం రూ.28 కోట్లతో ఈ చెరువును అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.చెరువులో 10 అడుగుల మేర పూడిక తొలగిస్తున్నామని, 9 నెలల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని విలేకరులతో చెప్పారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల వద్ద వర్షాకాలం వరద కష్టాలు తగ్గడంతోపాటు భూగర్భ జలాలు కూడా పెరిగినట్టు గుర్తించామన్నారు. నాచారం చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నామని, దీనితో మురుగు నీరు, దుర్గంధం, దోమల బెడద తగ్గి స్థానికులకు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.



### నాగిరెడ్డికుంటనూ అభివృద్ధి చేస్తాం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యాప్రాల్‌లోని నాగిరెడ్డి కుంటను కూడా అభివృద్ధి చేయనున్నట్టు కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలు జరుగుతున్నాయని, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొందరు కబ్జా చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదుల మేరకు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నాగిరెడ్డి కుంట నుంచి ఊర చెరువుకు వెళ్లే వరద కాలువను మళ్లించడంతో వరదలు సంభవిస్తున్నాయని, రెండు చెరువుల మధ్య ఉన్న నివాస ప్రాంతాలతోపాటు ఎగువ ప్రాంతాలు కూడా నీట మునుగుతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నాలా వెడల్పు ఆక్రమణలతో తగ్గడం వల్లే ఈ సమస్య తలెత్తుతోందని వారు వాపోయారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# కరాటే శిక్షకుల దరఖాస్తులకు ఆహ్వానం

నారాయణపేట జూలై 16 లోకల్ గైడ్,:నారాయణపేట జిల్లాలో సమగ్ర శిక్ష , పి.ఎం. శ్రీ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి బాలికా విద్యార్థులకు ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమం కొరకు శిక్షకుల దరఖాస్తులు చేసుకోవాలని డి వై ఎస్ ఓ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ ,సమగ్ర శిక్ష ఛైర్మన్ ఆమోదం, డిఇఓ నారాయణపేట ఆదేశాల మేరకు, బాలికా విద్యార్థుల కు అవసరమైన ఆత్మరక్షణ నైపుణ్యాలను కల్పించి, వారి భద్రత, ఆత్మవిశ్వాసా న్ని పెంపొందించేందుకు, 2026-27 విద్యా సంవ త్సరంలో నారాయణపేట జిల్లాలోని అన్ని పి.ఎం. శ్రీ పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమం అమలు చేయబడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలోని పి.ఎం. శ్రీ పాఠశాలల్లో కరాటే, జూడో, కుంగ్ ఫూ, కలరిపయట్టు, టేక్వాండో లేదా మరేదైనా గుర్తింపు పొందిన యుద్ధ కళల వంటి విభాగాలలో అనుభవం ఉన్న అర్హతగల ఆత్మరక్షణ శిక్షకులకు నియమించబడుతుందనీ తెలిపారు. జిల్లాలోని అర్హత, ఆసక్తి కలిగి ఉన్న ఆత్మ రక్షణ శిక్షకులు ఈ నెల 20 సోమవారం సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను ఆధార్ కార్డు , అవసరమైన ధ్రువపత్రాలను జతపరిచి జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, మినీ స్టేడియం నారాయణపేట సమర్పించాలని తెలిపారు.

# ఘనంగా గోల్కొండ జగధాంబిక మహంకాళి అమ్మవారికి ప్రథమ బోనం సమర్పణ.



రాజేంద్ర నగర్, ( లోకల్ గైడ్ ): ఆషాడమాసం బోనాల సందర్భంగా గోల్కొండలో జరిగిన మొదటిబోనం కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి అంగరంగ వైభవంగా జరుగుతున్న బోనాల జాతరలో పాల్గొ న్నారు. తెలంగాణ వ్యాప్తంగా జరిగే బోనాల్లో మొట్ట మొదట తెలంగాణ కుమ్మర్ల బోనం గోల్కొండ జగధాంబిక మహంకాళి అమ్మవారికి సమర్పి ంచడం ఆన వాయితీగా వస్తు ందని ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. రాష్ట్రంలో విస్తారమైన వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా దిగుబడిని ఇవ్వాలని ప్రజలు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా గోల్కొండ జగధాంబిక మహంకాళి అమ్మవారు కృపా కటాక్షాలు కలిగించాలని వేడుకున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్యే ..! స్వంత పొలంలో పెంచిన పండ్ల తోటల పరిశీలన.

తోట షెడ్ లో పెంచిన పశువుల పోషణ పై ప్రత్యేక శ్రద్ద..



వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 16: ప్రజా క్షేత్రం ఎమ్మెల్యేగా, వృత్తి విత్యా కాంట్రాక్టర్ గా పని చేస్తు మరో వైపు వ్యవసాయ రంగం పై మక్కుతో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముందుకు సాగుచ న్నారు. ఎమ్మెల్యే కు సమయం ఉన్నప్పుడు తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పండ్ల తోటలను, పంట పొలాలను, పశు వు పోషణను చూసుకోవడం అలవాటుగా మార్చుకున్నాడు. బుదవారం కొత్తకోట లో సీ ఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత మరుసటి రోజు ఉదయం గురువారం వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న దొడగుంటపల్లి శివారులోని తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన కొబ్బరి, మామిడి, జామ తోటలను పరిశీలించి, మొక్కల పెరుగుదలను చూసుకున్నారు. అనంతరం పెంచుతున్న గోవులకు, స్వయంగా అరటిపండ్లు తినిపిస్తూ వాటి బాగోగుల గురించి ఆరా తీసారు. ప్రస్తుతం వనపర్తి ఎమ్మెల్యేగా ప్రజాసేవలో బిజీగా ఉన్నప్పటికీ, వృత్తిరీత్యా ప్రముఖ కాంట్రాక్టర్ అయినప్పటికీ, తూడి మేఘారెడ్డి కి వ్యవసాయంపై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదు.రైతు కుటుంబ విలువలను, వ్యవసాయం గొప్పతనాన్ని ఎప్పటికప్పుడు గుర్తుచేసుకుంటూ వ్యవసాయాన్ని తన జీవితంలో విడదీయరాని భాగంగా భావిస్తారు.పంటల సంరక్షణతో పాటు పశుసంపద అభివృద్ధిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆయన ప్రత్యేకత. ప్రజా సమస్యల పరిష్కారంలో నిత్యం నిమగ్నమై ఉండే ఎమ్మెల్యే మేఘారెడ్డి , అవకాశం దొరికినప్పుడల్లా తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పంటలు, తోటలు, పశువులను కోసం కొంత సమయాన్ని కేటాయిస్తుంటారు. రైతుల కష్టాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే నాయకుడిగా, వ్యవసాయాభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమనే నమ్మకంతో ఆయన ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తున్నారు.ప్రజాసేవను ఒక బాధ్యతగా, వ్యవసాయాన్ని ఒక జీవన విధానంగా భావించే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, పశుసంపద పరిరక్షణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శప్రాయమైన నాయకత్వాన్ని చాటుతున్నారు.

# గాదెపాడు రైల్వే లైన్ భూ నిర్వసితుల భూముల పరిశీలన

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎంఆర్ఓ




ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 16 : మండలంలోని గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని డోర్నకల్--



భద్రాచలం రైల్వే డబుల్ లైన్ నిర్వాసితుల భూములను పరిశీలించడానికి గురువారం నాడు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , ఎమ్మార్వో , ఆర్ఐ , జీపీఓ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి ఎఫ్ఆర్ఓ , డిఆర్ఓ , ఎఫ్‌బీఓ , రైల్వే డిపార్ట్మెంట్ నుంచి రైల్వే డీఈ , జేఈ , గాదెపాడు సర్పంచ్ రంజిత్ కుమార్ , భూ నిర్వాసితులు , ఒడ్డుగూడెం, చర్లపల్లి , గాదెపాడు గ్రామ రైతులు అందరూ ఈ ఎంక్వయిరీలో పాల్గొన్నారు. ఈ పరిశీలన సందర్భంగా 67వ సర్వే నంబరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని ఫారెస్ట్ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది . దీంతో రెవెన్యూ , ఫారెస్ట్ శాఖ అధికారులు సంయుక్తంగా హద్దులను క్షుణంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , రికార్డులను పూర్తిగా పరిశీలించి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని భూ నిర్వాసిత రైతులకు వివరించారు. అలాగే ఫారెస్ట్ శాఖ అధికారులు కూడా రికార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆ భూమికి సంబంధించి రైల్వే శాఖకు ఎలా పరిహారం (కాంపెన్సేషన్ ) ఇవ్వాలనే అంశాన్ని నిర్ణయిస్తామని తెలిపారు. ఎఫ్ఆర్ఓ కూడా పై అధికారులతో చర్చించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో కు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివరించారు.ఈ ఎంక్వయిరీలో గాదెపాడు సర్పంచ్ రంజిత్ కుమార్, భూ నిర్వాసిత రైతులకు న్యాయం జరిగేంత వరకు ఈ సమస్యను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. రైతుల భూమి -- రైతుల హక్కు.ప్రజాప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి పనులతో పాటు, భూ నిర్వాసిత రైతులకు చట్టబద్ధమైన న్యాయం, తగిన పరిహారం, పారదర్శకమైన నిర్ణయాలు కూడా అంతే ముఖ్యమైనవిప్రభుత్వ అధికారులు అందరూ ఈ అంశంపై చైతన్యంతో ఆలోచించి , రైతుల న్యాయమైన హక్కులకు మద్దతుగా స్పందించాలని సర్పంచ్ రంజిత్ కుమార్ అధికారులను కోరడం జరిగింది.

## పదో తరగతి జీవితానికి పునాది..

## క్రమశిక్షణతో చదివితే విజయం ఖాయం: కలెక్టర్ కె. హైమావతి



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 16: విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ప్రతిరోజూ చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె పాఠశాల పరిసరాలను పరిశీలించి, పచ్చని వాతావరణాన్ని అభినందించారు.పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్.. అన్ని సబ్జెక్టుల బోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం గోడలపై రాసిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత, సైన్స్ సూత్రాలపై విద్యార్థులను ప్రశ్నించి, వాటిని ప్రతిరోజూ చదివితే సులభంగా గుర్తుండిపోతాయని చెప్పారు.అర్థం కాని పాఠాలను పలుమార్లు చదివితే నేర్చుకోవడం సాధ్యమేనని, పుస్తకాలతో పాటు రోజూ వార్తాపత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలని సూచించారు. సందేహాలను నిర్భయంగా ఉపాధ్యాయులను అడగాలని, మంచి అలవాట్లు అలవరుచుకుని జీవితంలో ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.పదో తరగతి జీవితానికి బలమైన పునాది అని పేర్కొన్న కలెక్టర్.. ప్రతి విద్యార్థి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# భారత్ గ్యాస్ కేంద్రంలో భద్రతా మాక్ డ్రిల్ అప్రమత్తతే భద్రతకు తొలి అడుగు: పోలీసులు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, జూలై 16:-చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భారత్ గ్యాస్ కేంద్రంలో గురువారం పోలీసులు భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ కేంద్ర ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించే విధంగా సిబ్బంది సన్నద్ధతను ఈ మాక్ డ్రిల్ ద్వారా పరీక్షించారు. ఇప్పటికే ఉన్న భద్రతా చర్యలను సమీక్షించి, మరింత పటిష్ఠంగా అమలు చేయాల్సిన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు.అప్రమత్తతే తమ బాధ్యతని, ప్రజల భద్రతే తమ ప్రాధాన్యమని ఈ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు.

# రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ ప్రక్రియను ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా పూర్తి చేయాలి.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్ ): రేషన్ కార్డులలో నమోదైన కుటుంబ సభ్యులందరూ తమకు కేటాయించిన చౌకధరల దుకాణం (ఎఫ్ పి ఎస్ )కు వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారిణి వనజలత తెలిపారు. జిల్లాలోని కొన్ని రేషన్ కార్డులలో ఒకరు లేదా ఇద్దరు కుటుంబ సభ్యులు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేయగా, మిగిలిన కుటుంబ సభ్యులు ఇంకా పూర్తి చేయలేదన్నారు. అటువంటి రేషన్ కార్డుదారులు ఆలస్యం చేయకుండా ప్రతి కుటుంబ సభ్యుని ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా రేషన్ కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల వివరాలు ధ్రువీకరించబడతాయని తెలిపారు. . ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు నిరంతరాయంగా అందాలంటే ప్రతి కుటుంబ సభ్యుని ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయడం ఎంతో అవసరమన్నారు. అందుకోసం ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత చౌకధరల దుకాణం లేదా మండల పౌర సరఫరాల అధికారులను సంప్రదించాలన్నారు.

# విషమిచ్చి చిరుతపులిని హతమార్చిన ఇద్దరు అరెస్ట్ పరారీలో మరో నలుగురు...పోలీస్ కమీషనర్ వెల్లడి




నిజామాబాదు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 16: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పరిధిలోని భీంగల్ మండలం కారేపల్లి దక్షిణ బీట్ అటవీ ప్రాంతంలో చిరుతపులిని విషమిచ్చి హతమార్చిన ఘటనలో ఇద్దరిని అటవీశాఖ అధికారులు గురువారం అరెస్టు చేశారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.అటవీశాఖకు అందిన సమాచారం మేరకు కమ్మర్‌పల్లి రేంజ్ అధికారి కే. అనిత ఆధ్వర్యంలో అధికారులు విచారణ చేపట్టారు. తాళ్లపల్లి గ్రామానికి చెందిన మాలావత్ సంజీవ్, దేవక్కపేట గ్రామానికి చెందిన సిరిసిల్ల రాములను ప్రశ్నించగా చిరుతపులిని చంపినట్లు అంగీకరించారు. వారి సూచన మేరకు కారేపల్లి దక్షిణ బీట్‌లోని 79వ కంపార్ట్‌మెంట్‌లో భూమిలో పాతిపెట్టిన చిరుతపులి కళేబరాన్ని వెలికితీశారు.విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. సుమారు నెల రోజుల క్రితం మాలావత్ సంజీవ్ మేకలను మేపుతుండగా ఒక ఆడమేకను చిరుతపులి చంపింది. ఈ విషయాన్ని తెలుసుకున్న సిరిసిల్ల రాములు చిరుతపులిని చంపి దాని శరీర భాగాలను విక్రయిస్తే భారీగా డబ్బు వస్తుందని ప్రలోభపెట్టాడు. దీంతో సంజీవ్ తన గ్రామానికి చెందిన మరో నలుగురితో కలిసి మేక కళేబరంలో విషాన్ని సిరంజి ద్వారా ఎక్కించారు. మరుసటి రోజు చిరుతపులి మృతి చెందినట్లు గుర్తించి, దాని కళేబరాన్ని భూమిలో దాచిపెట్టి కొనుగోలుదారుడు దొరికిన తర్వాత విక్రయించాలని యోచించినట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా సిరిసిల్ల రాములు ఇంట్లో తనిఖీ చేయగా ఎటువంటి లైసెన్స్ లేని ఒక నాటు తుపాకీ లభించింది. దానిని తదుపరి విచారణ కోసం భీంగల్ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా గత నాలుగైదు నెలల క్రితం ఇందల్ వాయి రేంజ్ ఆన్సంపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణి అయిన చిరుతపులిని ఉద్దేశపూర్వకంగా హతమార్చినందుకు ఒకరిని అదుపులోనికి తీసుకోగ మిగతా నిందితులు పరారిలో ఉన్నట్లు తెలిపారు ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అట్టి కేసు విచారణ లో భాగంగా తొమ్మిది నాటు తుపాకులను స్వాధీనం చేసుకొన్నట్లు పోలీస్ కమీషనర్ వివరించారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం--2022, తెలంగాణ అటవీ చట్టం, జీవవైవిధ్య చట్టాల కింద కేసులు నమోదు చేసి ఆర్మూర్ న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

# బూర్గుల భవితకు బంగారు బాట వేసిన శంకర్ అన్న. బూర్గుల గ్రామాభివృద్ధి కి రూ.25 లక్షల నిధుల మంజూరు. తొలి విడతగా రూ.8 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం.

బూర్గుల రూపురేఖలు మారుస్తున్న ఎమ్మెల్యే శంకరన్న - కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయికల్ శ్రీనివాస్.



షాద్ నగర్, లోకల్ గైడ్ : బూర్గుల గ్రామానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న మంజూరు చేసిన రూ.25 లక్షల అభివృద్ధి నిధుల్లో భాగంగా రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బూర్గుల గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే శంకరన్న ప్రత్యేక చొరవతో బూర్గుల గ్రామానికి వరుసగా అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఇటీవల బూర్గుల గ్రామానికి సుమారు రూ.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో కూడిన భారీ ప్రభుత్వ హైస్కూల్ మంజూరు కానుండడం గ్రామ అభివృద్ధిలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే శంకరన్నకు గ్రామ ప్రజల తరఫున, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బూర్గుల గ్రామానికి రానున్న రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని రాయికల్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారు జన్మించిన బూర్గుల గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇతర గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేసినప్పటికీ, బూర్గుల రామకృష్ణారావు సొంత గ్రామంలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..బూర్గుల గ్రామ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు రూ.25 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్ గారికి గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బాలరాజు గౌడ్, సర్పంచ్ల సంఘం ప్రెసిడెంట్ ర్యాకల శ్రీనివాస్, బూర్గుల సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, విలేజ్ ప్రెసిడెంట్ నర్సింలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సర్పంచు శివలీల, వార్డు సభ్యులు కవిత, సత్యనారాయణ, స్వప్న, రాజారాం, పవన్ కుమార్, సంతోష్ గౌడ్, హరీశ్వర్, శేఖర్, జంగమ్మ , మాజీ సర్పంచులు శివ కుమార్, పరుశురాం, గ్రామస్తులు జంగయ్య , నర్సింగ్, వినోద్ గౌడ్, నాగరాజ్, శివకుమార్, కిషన్ నగర్ సర్పంచ్ నరసింహులు చౌలపల్లి సర్పంచ్ జంగయ్య, ఉప్పరగడ్డ సర్పంచ్ చందు నాయక్, దేవునిపల్లి సర్పంచ్ మల్లేష్, కమ్మదనం నవీన్, అన్నారం సర్పంచ్ రామకృష్ణ, అన్నారం మాజీ సర్పంచ్ రాములు గౌడ్, మట్ట వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు శ్రీశైలం ముదిరాజ్, శ్రీశైలం, రాజు, ఎలికట్ట డిప్యూటీ సర్పంచు అభినవ్, అయ్యవారిపల్లి భరత్ రెడ్డి, పుల్లారెడ్డి, లింగారెడ్డి గూడ డిప్యూటీ సర్పంచు అశోక్, కడియాలకుంట మాజీ సర్పంచ్ రాజు నాయక్, చించోడ్ బాబా, లయీక్ భాయ్, రాజు, బసప్ప, సద్దుల ఆంజనేయులు, భరత్, వినయ్, సందీప్, శేఖర్, దాస్య నాయక్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు అయ్యేవిధంగా బిఎల్ఓ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



లోకల్ గైడ్, వికారాబాద్ :గురువారం వికారాబాద్ నియోజకవర్గంలో దారుర్ మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, మహిళా సంఘం సమావేశం, ఇందిరమ్మ మహిళా శక్తి కుట్టు కేంద్రం, తరిగోపులలో ప్రాథమిక పాఠశాలను, ఆయిల్ ఫామ్ సాగు, వ్యవసాయ పంట పొలాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎస్ఐఆర్ లో భాగంగా ఇంటింటికి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా తిరిగి వచ్చే విధంగా బిఎల్ఓ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో ప్రజలకు సహకరించాలని అదేవిధంగా తండాలలోని ప్రజానీకానికి సైతం ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో ఎన్యూమరేషన్ ఫారాలను వెనక్కి తీసుకుని డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.గ్రామాల్లో లేని వారు ఆన్ లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలి అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ తెలిపారు.మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్న సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ( ఎన్ ఎఫ్ బి ఎఫ్ )ను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునే విధంగా డ్వాక్రా మహిళలు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు.విద్యార్థిని,విద్యార్థులకు ఏకరూప దుస్తులను సిద్ధం చేస్తున్న ఇందిర మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.పంపిణీకి సిద్ధం ఉన్న దుస్తులను పాఠశాలకు అందజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.సకాలంలో వర్షాలు కురియని పక్షంలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. రైతు నేస్తం సమావేశాలు నిర్వహించి యూరియా, డిఏపి లభ్యతపై ఏఈఓల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు అనంతరం తరిగోపుల ప్రాథమిక పాఠశాలను సందర్శించి గుణితాలు, గణితంలో విద్యార్థుల నైపుణ్యతను గుర్తించి జిల్లా కలెక్టర్ అభినందించారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలతో బోధించడంతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ సూచించారు తరిగోపుల లో ఆయిల్ ఫామ్ సాగును జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఆసక్తి చూపే రైతులను గుర్తించి ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు వల్ల లాభాలు, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, అంతర పంటల సాగుపై కూడా రైతులకు సూచించాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, డిహెచ్ఎస్ఓ సత్తార్, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీడీఓ నరసింహులు, ఎంఈఓ చెన్నయ్య, దారుర్ సర్పంచ్ పర్మిల తదితరులు ఉన్నారు.

# లేత మనసుకు రీల్స్ షాక్

**ఆన్‌లైన్ షార్ట్స్, రీల్స్‌కు దాసోహమవుతున్న పిల్లలు**

**ఒకదాని వెంట మరొకటి.. గంటలకొద్దీ వీక్షణం**

**రకరకాల కంటెంట్లు.. భావోద్వేగ హెచ్చుతగ్గులు**

**నిద్ర, ఆరోగ్యం, చదువుపై తీవ్ర ప్రభావం**

**వెల్లడిస్తున్న అంతర్జాతీయ అధ్యయనాలు**



షార్ట్స్, రీల్స్.. కంటెంట్ ఏదైనా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తున్న వీడియోల వీక్షణం ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి వ్యసనంలా దాపురించింది. మాట్లాడటాన్ని మినహాయిస్తే ఒకప్పుడు ఖాళీ సమయాల్లో కొద్దిసేపు వెలిగే మొబైల్ 'తెర'.. ఇప్పుడు గంటలకొద్దీ కాంతిని వెదజల్లుతోంది. ఒకదాని వెంట మరొకటిగా ప్రత్యక్షమయ్యే వీడియోలను విడిచి పెట్టకుండా చూసేస్తున్నారు. అయితే పిల్లలు సైతం ఈ వ్యసనం బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. స్మార్ట్ ఫోన్లలో అందుబాటులో ఉండే యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర యాప్‌లలో అప్‌లోడ్ అవుతున్న ఈ తక్కువ నిడివి వీడియోలు చూడటం నిత్యకృత్యంగా మారింది. డ్యాన్సులు, పాటలు, హాస్యం, నేరాలు, ప్రాంక్ (ప్రాక్టికల్ జోక్స్)..ఇలా అంశం ఏదైనా కోట్లాది షార్ట్ వీడియోలు సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి. వంటలు చేయడం, పర్యాటక ప్రదేశాలు, ప్రపంచ దేశాలను చుట్టేయడం..వీటన్నిటినీ అప్‌లోడ్ చేసేది కొందరైతే, అవన్నీ చూస్తూ మొబైల్ స్క్రీన్ ముందు ఎంత సమయం గడుపుతున్నదీ తెలియనంతగా జనం లీనమై పోతున్నారు. వీటిల్లో చాలా వీడియోలు పిల్లలకు పనికొచ్చేవి కాదు..వారిని ఉద్దేశించి చేసినవీ కాదు. అయినప్పటికీ కోట్లాది మంది పిల్లలు వీటికి అలవాటుపడ్డారు. భారీ వరదలా ముంచెత్తే కంటెంట్ ప్రవాహం వీరి నిద్రకు అంతరాయం కలిగిస్తోంది. అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. చదువులపై ప్రభావం చూపిస్తోంది. స్మార్ట్‌ఫోన్ యూజర్లు ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా 40 వేల కోట్ల యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వీక్షస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

నియంత్రణ కోల్పోయి..

సాధారణంగా 15ఉ90 సెకన్ల వ్యవధితో ఉండే ఈ చిన్న వీడియోలు మెదడు ఎప్పటికప్పుడు కొత్తదనం కోరుకునేలా రూపొందాయి. స్వైప్ చేసిన ప్రతిసారీ కొత్త వీడియో దర్శనమిస్తుంది. ఇంకేముంది.. స్క్రీన్‌తోనే తెల్లవారుతోంది.. అదే స్క్రీన్‌తో నిద్రలోకి జారుకుంటున్నారు. లక్ష మంది పాలుపంచుకున్న 71 అధ్యయనాలను విశ్లేస్తే.. పెద్ద ఎత్తున షార్ట్ వీడియోల వీక్షణంతో స్వీయ నియంత్రణ, పని, చదువుపై శ్రద్ధ తగ్గిందని తేలింది. ముఖ్యంగా నిద్రపై తీవ్ర ప్రభావం పడుతోంది.

నిద్రకు దూరం..

షార్ట్ వీడియోలు చూసే వారు సరిపడా నిద్రకు దూరమవుతున్నారు. చాలామంది పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్స్‌లో విహరిస్తున్నారు. వేగవంతమైన కంటెంట్‌లో ఉండే భావోద్వేగ హెచ్చు తగ్గులు మెదడుకు ప్రశాంతత లేకుండా చేస్తాయి. నిద్రపోవడం కష్టమవుతుంది. మరో అధ్యయనం ప్రకారం అధికంగా షార్ట్ వీడియోల వీక్షణంతో కొంతమంది టీనేజర్లు పేలవమైన నిద్ర, బిడియం, ఆందోళనకు గురి అవుతున్నట్టు వెల్లడైంది.

హెచ్చరిక లేకుండానే ప్రత్యక్షం

స్వీయ నియంత్రణ విషయంలో చిన్నపిల్లల్లో తక్కువ పరిణతి ఉంటుంది. పైగా చాలావరకు సున్నిత మనసు?కలు. దీంతో త్వరితగతిన భావోద్వేగానికి గురవుతున్నారు. పిల్లలు ఎప్పుడూ చూడకూడని కంటెంట్ సైతం దర్శనమీయడం ప్రమాదానికి కారణం అవుతోంది. పిల్లల ప్రమేయం లేకుండానే వీడియోలు ఒకదాని తర్వాత ఒకటి ఆటోప్లే అవుతుంటాయి. హింసాత్మక, హానికరమైన చాలెంజ్‌లు, లైంగిక కంటెంట్ సైతం తెరపై ప్రత్యక్షమవుతుంటుంది. గంటల నిడివిగల వీడియోలు, సంప్రదాయ సోషల్ మీడియా పోస్ట్‌లకు భిన్నంగా షార్ట్ వీడియోలు ఎటువంటి హెచ్చరిక ప్రదర్శించవు. దీంతో భావోద్వేగ పరంగా సిద్ధం కావడానికి ఎలాంటి అవకాశమూ ఉండదు.

భావోద్వేగాలను ఎదుర్కోవడానికి..

కంటెంట్, సౌండ్‌లో ఆకస్మిక మార్పు, భావోద్వేగపరమైన హెచ్చుతగ్గులు అభివృద్ధి చెందుతున్న మెదడులకు ఇబ్బంది కలిగిస్తుంది. అందరు పిల్లలపై ప్రతికూల మానసిక ప్రభావం చూపనప్పటికీ.. ఆందోళన, శ్రద్ధ వహించడంలో ఇబ్బందులు, భావోద్వేగ అస్థిరత ఉన్నవారు మానసిక స్థితిలో మార్పులకు ఎక్కువగా గురవుతారు. అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఉన్నవారు ప్రధానంగా వేగవంతమైన కంటెంట్ వైపు ఆకర్షితులవుతారు. బెదిరింపులకు గురైన వారు, ఒత్తిడి, కుటుంబ అస్థిరత, పేలవమైన నిద్రతో బాధపడుతున్న పిల్లలు కష్టమైన భావోద్వేగాలను ఎదుర్కోవడానికి రాత్రి సమయంలో షార్ట్ వీడియోలను చూస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

నైపుణ్యాలు బలహీనం..

సంబంధాల నిర్మాణం, విసుగును తట్టుకోవడం, అసౌకర్య భావాలను ఎదుర్కోవడం బాల్యంలో నేర్చుకుంటారు. అలాంటిది ఎక్కువగా శీఘ్ర వినోదానికి అలవాటు పడిపోయినప్పుడు.. పిల్లలు కలలు కనడం, ఆటలు, కుటుంబంతో ముచ్చటించడం లేదా వారి సొంత ఆలోచనల్లో విహరించడం వంటి అవకాశాలను కోల్పోతారు. బడి నుంచి ఇంటికి వచి?చన తర్వాత ఖాళీ సమయంలో లేత మనసులు తమను తాము ఉల్లాసపర్చుకోవడం, అంతర్గత దృష్టిని పెంపొందించు కోవడం వంటివి చేయాలి. అది కరువైతే నైపుణ్యాలు బలహీన పడతాయని నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

### తల్లిదండ్రులు ఏం చేయాలి..

నిద్ర, ఆఫ్‌లైన్ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలి. ఆరు బయట క్రీడలు, పఠనం, అభిరుచులను ప్రోత్సహించాలి.  కంటెంట్, ఆన్‌లైన్ అనుభవాల గురించి పిల్లలతో చర్చించి అవగాహన కల్పించాలి. డిజిటల్ ప్రయోజనాలు, స్క్రీన్ వీక్షణ ప్రభావాల గురించి వివరించాలి.

# కర్మ యోగం... కర్తవ్య పాలన



భారతీయ జీవన దర్శనం ప్రకారం ఈ జగత్తంతా దైవమయం. మనం చేసే ప్రతి కర్మను ఆ పరమాత్మకు అర్పించే 'నైవేద్యం'గా భావించాలి. ఉపనిషత్తులు బోధించిన సూత్రం ప్రకారం, కర్మలను చేస్తూనే వాటి ఫలితాలకు అంటకుండా ఉండటమే జీవన ముక్తి. అహంకారాన్ని వీడి, 'నేను కర్తను కాదు, కేవలం ఒక నిమిత్త మాత్రుడను' అనే భావనతో పని చేసినప్పుడు ఆ కర్మకు పుణ్యపాపాలు అంటవు. ఆర్ష ధర్మం ప్రతిపాదించిన అదుతే జీవన వేదాంతం కర్మయోగం. లోకంలో జన్మించిన ప్రతి మానవుడు కర్మ చేయక తప్పదు. అయితే, ఆ కర్మను బంధనంగా మార్చుకోవాలా లేక మోక్ష మార్గంగా మలచుకోవాలా అన్నదే ఇక్కడి అసలైన ప్రశ్న. భగవద్గీతలో క ృష? పరమాత్మ అందించిన 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే దివ్య శ్లోకం మానవాళికి ఒక శాశ్వత దిక్సూచి. పని చేయడంపైనే నీకు అధికారం ఉంది గానీ, ఫలితంపై లేదని చెప్పడం వెనుక లోతైన మనస్తత్వ శాస్త్రం దాగి ఉంది. ఫలితంపై అతిగా ఆశ పెంచుకున్నప్పుడు మనిషిలో ఆందోళన, భయం, అసహనం ప్రవేశిస్తాయి. అదేపనిని దైవ కార్యంగా భావించి చేసినప్పుడు ఆ కర్మ 'యోగం'గా మారుతుంది. ఇది కేవలం సిద్ధాంతం కాదు, నిత్య జీవితంలో అనుసరించదగిన పరమ సత్యం. కర్మయోగం అంటే పలాయనవాదం కాదు, అది సంపూర?మైన క్రియాశీలత. ఒక శిల్పి విగ్రహాన్ని చెక్కుతున్నప్పుడు కేవలం ఆ ప్రతిమ ఎంత ధరకు అమ్ముడవుతుందనే ఆలోచనతో ఉంటే, ఆ శిల్పంలో జీవం ఉట్టిపడదు. అదే శిల్పి తన నైపుణ్యాన్ని పరమాత్మకు అర్పిస్తున్నాననే భావనతో చెక్కితే, ఆ పనిలో ఒక అలౌకికానందం వెల్లివిరుస్తుంది. అలాగే ఒక వైద్యుడు కేవలం ధనం కోసమే చికిత్స చేస్తే అది వ్యాపారం అవుతుంది. అదే వైద్యుడు రోగిలో దైవాన్ని చూస్తూ, తన విజ్ఞానాన్ని ప్రాణదానానికి అంకితం చేస్తే అది పవిత్ర యజ్ఞమవుతుంది. ఫలితం భగవంతుడి నిర?యమని నమ్మి, తన శక్తినంతా చికిత్సపైనే కేంద్రీకరించినప్పుడు ఆ వైద్యుడికి మానసిక ఒత్తిడి ఉండదు. ఈ నిష్కామ బుద్ధి మనిషిని నిరంతరం ఉన్నత స్థితిలో నిలబెడుతుంది. అగ్ని తన ధర్మాన్ని తాను నిర్వర్తించినట్లు, మనిషి తన స్వధర్మాన్ని నిష్కామంగా ఆచరించాలి. ఈ మార్గంలో అత్యంత ముఖ్యమైనది 'ఫలత్యాగం'. అంటే ఫలితాన్ని వదిలేయడం కాదు, ఫలితం వల్ల కలిగే హర్ష విచారాలకు అతీతంగా ఉండటం. విజయం వస్తే పొంగిపోకుండా, అపజయం ఎదురైతే కుంగిపోకుండా ఉండే స్థితి కర్మయోగికి మాత్రమే సాధ్యం. యోగశాస్త్రం బోధించిన ఈ నిష్కామ కర్మ సిద్ధాంతం వ్యక్తిని కర్తవ్యోన్ముఖుడిని చేస్తుంది. చేసే పనిలో దైవత్వాన్ని వెతుక్కున్నప్పుడు ఒత్తిడి మాయమై శాంతి ప్రవహిస్తుంది. ప్రతి క్షణం మన కర్మను ఒక ఆరాధనగా మలుచుకుంటే, ఈ ప్రపంచమే ఒక వైకుంఠమవుతుంది. స్వార్థపు చీకటిని తొలగించి, సేవా భావం అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఈశ్వరార్పణమస్తు!  నిప్పు నిప్పును కాల్చదు గానీ, దానిపై పడిన వస్తువును కాలుస్తుంది. అలాగే, అహంకారంతో చేసే కర్మలు బంధాలను స ృష్టిస్తే, నిరహంకారంతో చేసే కర్మలు మనసును నిర్మలం చేస్తాయి. సూర్యుడు ప్రతిరోజూ లోకానికి వెలుగును ఇస్తాడు, తనే వెలుగునిస్తున్నాననే అహంకారం ఆయనకు ఉండదు. అటువంటి నిస్వార్థ గుణమే మనల్ని మహోన్నతులుగా తీర్చిదిద్దుతుంది. నిత్య జీవిత సవాళ్లను సాకులు చెప్పకుండా ఎదుర్కోవడం, బాధ్యతలను భారం కాకుండా గౌరవంగా భావించడం కర్మయోగపు అంతరార్థం. ఈ జ్ఞానమే మనల్ని నిరంతరం కర్మపథంలో నడిపిస్తూ, అంతిమంగా ఆత్మానందానికి చేరువ చేస్తుంది.

# ప్రశాంత జీవన సూత్రం



సముద్ర తీరాన నిలబడినప్పుడు ఒక్కొక్కరి స్పందన ఒక్కోలా ఉంటుంది. ఒకరు అలల హోరును చూసి భయపడితే, మరొకరు పాదా లను తడిపే అలల స్పర్శతో పరవశిస్తారు, ఇంకొకరు నీటిపై తేలే రంగురాళ్లను ఏరుకుంటారు. కొందరు విలువైన రత్నాల కోసం లోతుకు వెళ్తారు. తీరాన స్థిరంగా నిలబడి, దేనితోనూ అంటుకోకుండా సముద్ర గమనాన్ని గమనించేవాడే నిజమైన 'ద్రష్ట'. మన ఆలోచనల నుండి మనం విడివడి, వాటిని కేవలం ఒక సాక్షిగా గమనించినప్పుడు, ఆ ఉద్వేగాల తీవ్రత క్రమంగా క్షణించి మనసు ప్రశాంత నిర్మల సాగరమవుతుంది. నదిలో కొట్టుకుపోయేవాడు ప్రవాహ వేగాన్ని కొలవలేడు, తీరాన నిలబడేవాడే దాని లోతును గ్రహించగలడు. జీవితంలో సంభవించే పరిణామాలు కూడా అలల వంటివేబీ అవి మనల్ని తాకవచ్చు గానీ ముంచేయకూడదు. ఈ నిరంతర జాగరూకతే మనల్ని నిలబెడుతుంది. నిశ్చలత్వమే నిత్య సత్యమని గ్రహించినప్పుడే మానవుడు పరిపూర్ణుడు కాగలడు. విశ్వజనీన ధర్మం కేవలం పూజాది క్రతువుల సముచ్చయం కాదుబీ అది అనంతమైన చైతన్య రహస్యాల నిధి. ముండకోపనిషత్తు ఉద్ఘాటించిన 'ద్వా సుపర్ణా సయుజా సఖాయా...' అనే దివ్య మంత్రం మానవ మనస్తత్వానికి ఒక అద్భుత భాష్యం. ఒకే వృక్షంపై నివసించే రెండు పక్షులలో ఒకటి భౌతిక ఫలాలను భుజిస్తూ సుఖదుఃఖాలకు లోనవుతుంటే, రెండవది కేవలం 'సాక్షి'గా వీక్షస్తూ ఆనందమయంగా ఉంటుంది.  లోకంలోని ద్వంద్వాలను అనుభవించేది ఒక పక్షి అయితే, ఆ అనుభవాన్ని నిర్లిప్తతతో గమనించేది మరో పక్షి. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఒత్తిడి కోరల్లో చిక్కుకున్న ఆధునిక మానవుడికి ఈ సాక్షిభావమే అత్యంత ఆవశ్యకమైన సంజీవని. ఆ దివ్య  దృష్టిలోనే జగత్తు అసలైన పరమార్థం నిబిడీకృతమై ఉంది. ఈ నిరంతర ఎరుక కలిగిననాడు మనిషి సామాన్య జీవి నుండి దైవత్వపు అంచులకు చేరుకుంటాడు. జ్ఞానాగ్నితో అజ్ఞానాన్ని దహించి, ఆత్మజ్ఞాన సౌరభాన్ని పొందడమే ఆర్ష సంస్కృతి మనకు బోధించే పరమ రహస్యం. మానవ జన్మ ధన్యమవ్వడానికి ఇటువంటి తాత్విక చింతన ఎంతో అవసరం. భగవద్గీతలో కృష్ణ పరమాత్మ బోధించిన 'అసంగత్వమే' ఈ సాక్షిభావం. తామరాకుపై నీటిబొట్టులా సంసారంలో ఉంటూనే, దేనికీ అంటకుండా ఉండటం ఒక దివ్య కళ. 'నేను కోపంగా ఉన్నాను' అని కాకుండా, 'నా మనసులో కోపం అనే తరంగం ఉద్భవించింది' అని గమనించడం ప్రారంభించిన క్షణమే ఆ వికారం ఆవిరైపోతుంది. ఇది పలాయనవాదం కాదుబీ పరిపూర్ణమైన అవగాహనతో కూడిన ప్రశాంత స్థితి. సుఖం వచ్చినప్పుడు అది ఒక అతిథి అని, దుఃఖం సంభవించినప్పుడు అది ఒక తాత్కాలిక మేఘమని భావించాలి. వైదిక విజ్ఞానం మనకు అందించిన ఈ అమోఘమైన దృక్పథం, వ్యక్తిని సమర్థుడిగా, సమాజాన్ని సలక్షణంగా తీర్చిదిద్దుతుంది. ఎక్కడైతే ద్వేషం ఉండదో, ఎక్కడైతే మమకారపు సంకెళ్లు ఉండవో, అక్కడ నిరతిశయమైన శాంతి విరాజిల్లుతుంది. సాక్షిభావంతో జీవించడం నేర్చుకుంటే, ప్రతి రోజూ ఒక ఉత్సవమే, ప్రతి క్షణం ఒక పరమపదమే.

చీకటిని నిందించడం కంటే చిన్న దీపాన్ని వెలిగించడం మేలు అన్నట్లు, కల్లోల ప్రపంచంలో మనశ్శాంతి అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఆ పరమాత్మ స్వరూపం! లోకాః సమస్తాః సుఖినో భవంతు! మేఘాలు వస్తుంటాయి, పోతుంటాయిబీ ఆకాశం మాత్రం ఎప్పుడూ నిర్మలంగానే ఉంటుంది. మన ఆత్మ ఆ ఆకాశం వంటి నిర్లిప్త స్థితి. ఇటువంటి మానసిక సంస్కారం అలవడినప్పుడు మనిషి ఏ పరిస్థితిలోనూ చెక్కుచెదరని ధైర్యంతో, ప్రశాంతతతో వ్యవహరించగలడు. అంతిమంగా, మన జీవిత నాటకంలో మనం కేవలం పాత్రధారులమే కాదు, ఆ నాటకాన్ని తిలకించే ప్రేక్షకులం కూడా అని గుర్తించడమే పరమ సత్యం. ఈ జ్ఞానమే మనల్ని బంధవిముక్తులను చేసి మోక్షమార్గాన నడిపిస్తుంది. నిష్కామ కర్మ ద్వారానే సిద్ధి కలుగుతుందని పెద్దల మాట.

# తిరగలి చూడాలి!

## ఆధ్యాత్మికథ



ఓ ఉదయం పాండిచ్చేరి పట్టణం నుంచి కారులో ఒక జంట తిరుమల కొండకు దర్శనానికి బయలుదేరింది. వారిది పాండిచ్చేరి స్వంత పట్టణమైనా, ప్రస్తుతం వారు అమెరికాలో నివసిస్తూ ఉన్నారు. దారి మధ్యలో తిరువళ్ళూరు వద్ద కారు పంక్చర్ అయ్యింది. కారును రోడ్డు పక్కన ఆపి టైరు మార్చుకోవడానికి అవస్థలు పడుతూ ఉన్నారు. అదే దారిలో తిరువళ్ళూరు నుంచి తిరుమలకు మరో జంట వెళ్తూ ఉన్నారు. ఆ తిరువళ్ళూరు జంట, పాండిచ్చేరి జంటను చూసి కారు ఆపింది. సమస్య తెలుసుకుని టైరు మార్చడంలో సహాయం చేయసాగారు. మాటల్లో రెండు జంటలూ దేవుని దర్శనానికి తిరుమలకు  వెళ్తున్నట్లు తెలుసుకుని సంతోషపడ్డారు. పాండిచ్చేరి జంట కొంచెం ఒత్తిడితో ఉన్నట్లు గుర్తించింది తిరువళ్ళూరు జంట. దర్శనానికి ఇంకా చాలా సమయం ఉంది కదా, ఎందుకు ఆదుర్దా పడుతున్నారని అడిగింది."మేము దారిలో ఉన్న నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళాలి. అక్కడ శ్రీ పద్మావతీ శ్రీనివాసుల దర్శనం చేసుకుని తిరగలి చూసి ఆపైన కొండకు రావాలి" అని సమాధానమిచ్చింది పాండిచ్చేరి జంట. "అవునా... నారాయణవనం అనేది స్వామివారికి కళ్యాణం జరిగిన ప్రదేశమని తెలుసు. కానీ తిరగలి గురించి తెలియదు. అక్కడి తిరగలి అంత విశేషమైనదా?" అని ఎదురు ప్రశ్న వేశారు. "ఎంతో విశేషమున్న తిరగలి అది. తప్పకుండా చూసి తీరాలి. గుడిలోని పద్మావతి అమ్మవారి ఆలయం పక్కన ఉంటుంది. స్వామివారి పరిణయోత్సవ వేడుకల్లో నలుగుపిండి, వడియాల పిండి, పసుపును విసరిన తిరగలి అది. వేల సంవత్సరాలైనా అది చెక్కు చెదరలేదు. మనవారు దాన్ని భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నారు" అని వివరించారు. "అయ్యో... మేము ఇంత దగ్గర ఉండి కూడా ఇన్నాళ్ళూ చూడలేకపోయామే. మీరు అమెరికానుంచి వచ్చి దాన్ని చూస్తున్నారు" అని ఆశ్చర్యపోయారు. ఇంతలో టైరును మార్చే పని పూర్తయ్యింది. అందరూ కలిసి నారాయణవనం వెళ్ళారు. ఏడుకొండలస్వామి ఎరుకలసాని వేషంలో ఆ పుర వీధుల్లోనే తిరిగినాడని తెలుసుకుని పులకరించిపోయారు. ఆకాశరాజు పుత్రిక పద్మావతిగా అవతరించిన శ్రీ మహాలక్ష్మిని శ్రీనివాసుడు వివాహమాడిన పుణ్యక్షేత్రాన్ని కనులారా చూశారు. అమ్మవారు విహారం చేసే విమాన ప్రదక్షణ మార్గంలో పసుపు కుంకుమలు పెట్టి ఉన్న తిరగలి కనిపించింది. అంత పెద్ద తిరగలిని తామెప్పుడూ చూడలేదని ఆశ్చర్యపోతూ ముక్కుమీద వేలు వేసుకున్నారు. తిరగలిని భక్తిభావంతో తాకిన ఆ నలుగురూ పరవశించిపోయారు. తిరగలిని చూస్తూ ఎంతో బలవంతులైతే కానీ దాన్ని తిప్పలేరని అనుకున్నారు. అప్పట్లో మనుషులు అంత బలంగా ఉండేవారు కాబట్టి అది సాధ్యమయిందని తిరగలికి దణ్ణం పెట్టుకుని తిరుమల ప్రయాణం కొనసాగించారు.

# డాక్టరమ్మలు తగ్గిపోతున్నారు!

**ఎంబీబీఎస్‌లో పెరిగిన విద్యార్థినులు**

**వృత్తిలో చేరాక మానేస్తున్న వైద్యులు**

**అనుకూలంగా లేని  పరిస్థితులే కారణం**

**భవిష్యత్తులో ఆరోగ్య రంగానికి దెబ్బే!**

**'బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్' నివేదిక**



డాక్టరమ్మకే కష్టం వచ్చి పడింది! విరామం లేని డ్యూటీలు, మానసిక ఒత్తిడి, ఇంటికిఉఆసుపత్రికి మధ్య నలిగిపోయే దైనందిన పోరాటం.. ఆమెను వైద్య వృత్తిని వదిలిపెట్టేలా చేస్తున్నాయి. నిజానికి ఎంబీబీఎస్ పట్టాను సాధించటం అన్నది ఎన్నో నిద్ర లేని రాత్రుల కల! ఆ కలను నెరవేర్చుకున్నప్పటికీ, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించలేని పరిస్థితులు లేడీ డాక్టర్‌లకు ఎదురవుతున్నాయి. మెడలో స్టెతస్కోప్ ధరించి, డాక్టరమ్మ చిరునవ్వుతో కనిపిస్తే చాలు.. జబ్బు సగం నయం అయినట్లే ఉంటుంది. కానీ ఇప్పుడా డాక్టరమ్మకే కష్టం వచ్చి పడింది! విరామం లేని డ్యూటీలు, మానసిక ఒత్తిడి, ఇంటికిఉఆసుపత్రికి మధ్య నలిగిపోయే దైనందిన పోరాటం.. ఆమెను వైద్య వృత్తిని వదిలిపెట్టేలా చేస్తున్నాయి. నిజానికి ఎంబీబీఎస్ పట్టాను సాధించటం అన్నది ఎన్నో నిద్ర లేని రాత్రుల కల! ఆ కలను నెరవేర్చుకున్నప్పటికీ, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించలేని పరిస్థితులు లేడీ డాక్టర్‌లకు ఎదురవుతుండటం దురదృష్టకరమే కాదు, దేశ ఆరోగ్య వ్యవస్థకే నష్టం. ఇండియాలో ఎంబీబీఎస్ చదివే మహిళల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. ప్రాక్టీస్ చేసే సమయానికి మహిళా పట్టభద్రులుబీ ఉద్యోగంలో చేరి కొంత కాలం పని చేసిన తర్వాత మహిళా డాక్టర్లు వైద్య వృత్తిని వదిలిపెట్టేస్తున్నారట. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బి.సి.జి.)ఉ దస్రా అనే స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా విడుదల చేసిన తాజా నివేదిక 'అడ్వాన్సింగ్ విమెన్ ఇన్ లీడర్‌షిప్ ఇన్ హెల్త్ కేర్'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అనుకూలంగా లేని పరిస్థితులే అందుకు ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది.

తీవ్రమైన ఒత్తిడి

పురుష డాక్టర్ల కంటే మహిళా డాక్టర్లు ఎక్కువ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. నివేదిక ప్రకారం, సుమారు 87 శాతం మంది మహిళా డాక్టర్లు మానసిక అలసటతో విధులను నిర్వర్తిస్తున్నారు.

ఇల్లుఉఆసుపత్రి

ఆసుపత్రిలో వారానికి 60 నుండి 80 గంటల కఠినమైన పని వేళలతో పాటు ఇంట్లో పిల్లల పెంపకం, ఇతర కుటుంబ బాధ్యతలు కూడా మహిళలే చూసుకోవాల్సి వస్తోంది. ఈ రెండు రకాల బాధ్యతలను సమన్వయం చేసుకోలేక లేడీ డాక్టర్‌లు తమకు ఇష్టమైన వైద్య రంగాన్ని వదులుకోవలసి వస్తోంది.

భద్రతా సమస్యలు

మహిళా డాక్టర్లకు పని ప్రదేశంలో భద్రత అనేది పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా చిన్న నగరాల్లో పనిచేసే వారిలో 70 శాతం కంటే ఎక్కువ మంది తాము సురక్షతంగా లేమని భావిస్తున్నట్లు తెలిపారు.

ప్రోత్సాహ లేమి

పని వేళలు అనుకూలంగా లేకపోవడం, ప్రసూతి సెలవుల తర్వాత తిరిగి చేరడానికి సరైన ప్రోత్సాహం లేకపోవడం వంటివి మహిళా వైద్యులను వెనక్కి లాగుతున్నాయి. అలాగే, వైద్య వృత్తిలో ఉన్నత పదవుల్లో మహిళలు తక్కువగా ఉండటం వల్ల మహిళా వైద్యుల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రభావం

మహిళా డాక్టర్లు వృత్తిని వదిలితే భవిష్యత్తులో గైనకాలజీ, పీడియాట్రిక్స్ వంటి విభాగాల్లో డాక్టర్ల కొరత ఏర్పడుతుంది. ఇది దేశ ఆరోగ్య వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

పరిష్కారం

పని ప్రదేశంలో మహిళా డాక్టర్ల భద్రతను పెంచటం పని వేళల్లో వెసులుబాటును కల్పించటం సమానమైన పనికి సమాన వేతనం పదోన్నతుల్లో సమానత్వం

గణాంకాలు.. ముఖ్యమైన అంశాలు

వృత్తిలో లేనివారు

పురుషుల్లో కేవలం 5ఉ10 శాతం మంది మాత్రమే ఖాళీగా ఉండగా, మహిళా పట్టభద్రుల్లో 30 శాతం మంది వైద్య వృత్తిలో కొనసాగటం లేదు.

స్పెషలైజేషన్‌లో వ్యత్యాసం

సర్జరీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగాలలోని మొత్తం నిపుణుల్లో మహిళల వాటా 10 శాతం కంటే తక్కువే.

ప్రవేశాలలో కొరత

దేశ వ్యాప్తంగా ఇంకా 7ఉ8 లక్షల మంది వైద్య నిపుణుల అవసరం ఉన్నప్పటికీ, సుమారు 60ఉ70 వేల మంది మహిళా నిపుణులు వైద్య వృత్తిలోకి ప్రవేశించటం లేదు.

నర్సుల్లో మహిళలే అధికం

దేశంలోని ఆసుపత్రుల్లో ఉన్న నర్సుల్లో సుమారు 70ఉ85 శాతం మహిళలే. కానీ, డాక్టర్లలో సీనియర్ లీడర్‌షిప్ విభాగాల్లో మాత్రం మహిళల సంఖ్య 20 శాతానికే పరిమితమైంది.

# గ్లామర్ క్వీన్ శోభితడ ఎల్ కవర్‌పై కొత్త స్టైల్‌తో సందడి!









గ్లోబల్ బ్యూటీ శోభిత ధూళిపాళ్ల మరోసారి ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వేదికపై తన ముద్ర వేసింది. ప్రతిష్టాత్మకమైన 'ఎల్' (జూలై) మ్యాగజైన్ 'ది ఆర్ట్ ఇష్యూ' కోసం కవర్ స్టార్‌గా మారి అందరి దృష్టిని ఆకర్షించింది. తనదైన స్టైల్, గ్రేస్ మరియు అదిరిపోయే యాటిట్యూడ్‌తో శోభిత చేసిన ఈ ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవలం గ్లామర్ మాత్రమే కాకుండా, తన ఆలోచనలతో కూడా మెప్పిస్తున్న ఈ బ్యూటీ గురించి మరిన్ని విశేషాలు ఇప్పుడు చూద్దాం. మ్యాగజైన్ కవర్‌పై మెరుపులు: ఫ్యాషన్ ప్రపంచంలో ఎల్ మ్యాగజైన్ కవర్‌పై కనిపించడం అంటే సామాన్యమైన విషయం కాదు. శోభిత ధూళిపాళ్ల తన అద్భుతమైన పర్సనాలిటీతో ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఈ షూట్‌లో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, ఆమె ఇచ్చిన పోజులు చాలా ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. కేవలం నటనతోనే కాకుండా, ఫ్యాషన్ సెన్స్‌తో కూడా శోభిత తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుందని ఈ కవర్ పేజీ చూస్తే అర్థమవుతోంది. ఆమె కళ్లలో ఉన్న తీక్షణత, ధరించిన హై-స్లిట్ డ్రెస్ ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ాశ్రీంశీ =ముఃం - ఆ హీరోయిన్ దృష్టిలో తమ్ముడే అత్యుత్తమ నటుడు! నటనలో తనదైన ముద్ర: శోభిత కేవలం గ్లామర్ డాల్‌గా మిగిలిపోవడానికి ఇష్టపడదు. ఆమె ఎంచుకునే పాత్రలు చాలా లోతుగా, ఆలోచింపజేసేలా ఉంటాయి. "మహిళలు విభిన్నమైన మనస్తత్వాలను కలిగి ఉన్నప్పుడే వారు చాలా ఆసక్తికరంగా కనిపిస్తారు" అని ఆమె ఈ ఇంటర్వ్యూలో తెలిపింది. అంటే కేవలం తెరపై కనిపించడం కోసమే కాకుండా, పాత్రలో లీనమై నటించడం తన నైజమని ఆమె చెప్పుకొచ్చింది. 'మేడ్ ఇన్ హెవెన్', 'గూఢచారి', 'మేజర్' వంటి చిత్రాలు ఆమె నటనలోని వైవిధ్యాన్ని ఇప్పటికే చాటిచెప్పాయి. ఈ షూట్ థీమ్ 'ఆర్ట్' కావడంతో, శోభిత తనలోని కళాత్మక కోణాన్ని ఆవిష్కరించింది. తన జీవితంలో క్యూరియాసిటీ అనేది తనను ముందుకు నడిపించే దారి అని ఆమె తెలిపింది. సినిమా అయినా, ఫ్యాషన్ అయినా అందులో కొత్తదనాన్ని వెతకడం ఆమెకు అలవాటు. ఫ్యాషన్ అనేది కేవలం బట్టలు వేసుకోవడం మాత్రమే కాదని, అది ఒక రకమైన భావ వ్యక్తీకరణ అని ఆమె నమ్ముతుంది. అందుకే ఆమె ఫోటోషూట్‌లు ఎప్పుడూ రొటీన్‌కు భిన్నంగా, చాలా స్పెషల్‌గా ఉంటాయి. సోషల్ మీడియాలో వైరల్ ఫోటోలు: శోభిత ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే అభిమానుల నుంచి భారీ స్పందన లభించింది. ఇక ముఖ్యంగా అక్కినేని నాగచైతన్యతో పెళ్లి తర్వాత ఆమెకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ కోసం నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇలాంటి పవర్‌ఫుల్ ఫోటోషూట్‌తో రావడం ఆమె ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ అని చెప్పాలి. కేవలం మన దేశంలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో శోభిత క్రేజ్ పెరుగుతోందనడానికి ఈ ఎల్ మ్యాగజైన్ కవర్ ఒక నిదర్శనం.

# సీతమ్మ ఎగ్జిట్ తో యామీ గౌతమ్ సీన్లోకి!



బాలీవుడ్ డైరెక్టర్ ఆనంద్ ఎల్ . రాయ్ ధనుష్, కృతి సనన్ జంటగా 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదొక రొమాంటిక్ లవ్ స్టోరీ. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. - ఆత్రాంగిరే - తర్వాత ధనుష్ తో ఆనంద్ తెరక్కిస్తోన్న మరో చిత్రం కావడంతో? ఈరేంజ్ బజ్ క్రియేట్ అవుతోంది. - గుడ్ లక్ జెర్రీ -, -% రక్షాబంధన్ - లాంటి సినిమాల వైఫల్యం తర్వాత ఆనంద్ ఎల్ . రాయ్ నుంచి రిలీజ్ అవుతోన్న చిత్రమిది. దీంతో ఈ సినిమాతో ఎలాగైనా కంబ్యాక్ అవ్వాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టే మార్కెట్లో బజ్ నెలకొంది. కాగా ఈ సినిమా సెట్స్ ఉండగానే ఆనంద్ మరో ప్రాజెక్ట్ కూడా సెట్ చేస్తున్నారు. - నయి నవేలీ - అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. భారతీయ జానపద కథలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హారర్ కామెడీ కథగా తెలుస్తోంది. ఇందులో హీరోయిన్ గా కృతిసనన్ ఎంపికైంది. తేరే ఇష్క్ మే%-%లో కృతి పెర్ఫార్మెన్స్ చూసి మరోసారి హీరోయిన్ ఛాన్స్ తనకే ఇచ్చాడు ఆనంద్. అయితే ఇప్పుడా ప్రాజెక్ట్ నుంచి కృతిసనన్ అనూహ్యంగా తప్పుకుంది. ఆమె ఎందుకు ఎగ్జిట్ అయిందన్నది తెలియదు గానీ ..మరో ఆలోచన లేకుండా రాయ్ అదే పాత్రకు యామీ గౌతమ్ ని ఎంపిక చేసారు. కృతి కంటే ఇప్పుడా పాత్రకు యామీ పర్ఫెక్ట్ గా సూటవుతుందని చిత్ర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో కృతిసనన్- ఆనంద్ ఎల్ రాయ్ మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ ఏవైనా తలెత్తాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి అసలు కారణం ఏంటి? అన్నది తెలియాలి. ఈ ఏడాది చివరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని రాయ్ టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇంతలోనే కృతి సనన్ తప్పుకోవడం..ఆమె స్థానంలోకి యామీ గౌతమ్ రావడం అంతా వేగంగా జరిగిపోయాయి. ప్రస్తుతం యామీ సక్సెస్ పరంగా మంచి స్వింగ్ లో ఉంది. %-%ఆర్టికల్ 370%-, -%ఓఎమ్ జీ 2%-% లాంటి శక్తివంతమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిం చింది. త్వరలో - హక్ - అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇంతలోనే ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో నటించే అరుదైన అవకాశం ఒడిసి పట్టుకుంది.

# పూరీ 'స్లమ్ డాగ్'.. రిలీజ్ కు ఇబ్బందులు తప్పవా?




స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం టాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న ఆ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా కనిపించనున్నారు. కీలక పాత్రల్లో టబు, దునియా విజయ్ కుమార్ నటిస్తున్నారు. రీసెంట్ గా ఆ మూవీకి స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్ అనే టైటిల్ ను ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. జనవరిలో విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ టైటిల్ ను రివీల్ చేస్తూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తి పెంచింది. పోస్టర్ లో ఆయన బిచ్చగాడి గెటప్ లో కనిపిస్తూ.. చేతిలో రక్తంతో తడిసిన కత్తి పట్టుకుని పవర్ ఫుల్ లుక్ లో మెప్పించారు. చుట్టూ చెల్లాచెదురుగా పడి ఉన్న డబ్బు కట్టలు కథలోని ఇంటెన్సిటీ సూచిస్తున్నాయి. సినిమాను పూరీ కనెక్ట్స్ బ్యానర్ పై పూరీ జగన్నాథ్ తో కలిసి చార్మీ కౌర్ నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ తరఫున జేబీ నారాయణరావు నిర్మాణంలో భాగమయ్యారు. సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే.. షూటింగ్ ను కేవలం ఐదు నెలల్లో పూర్తి చేశారు. అయితే సినిమా విడుదలకు ముందు కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పూరీ



జగన్నాథ్ దర్శకత్వం వహించిన గత చిత్రం లైగర్ చుట్టూ ఉన్న ఆర్థిక వివాదాలే. ఆ సినిమా వల్ల కొంతమంది డిస్ట్రిబ్యూటర్లకు నష్టాలు వచ్చాయని, వారికి చెల్లించాల్సిన బకాయిలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని టాక్ ఉంది. ఇక తర్వాత వచ్చిన డబుల్ ఇస్మార్ట్ సినిమా సమయంలో, బకాయిల్లో కొంత మొత్తం చెల్లించి, మిగిలిన దాన్ని సినిమా విడుదల తర్వాత చెల్లిస్తానని పూరీ మాటిచ్చారని సమాచారం. అయితే ఆ హామీ పూర్తిగా నిలబెట్టుకోలేదని ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు పంపిణీదారులు బకాయిలు క్లియర్ అయ్యేవరకు పూరీ జగన్నాథ్ సినిమాలు రిలీజ్ చేయనివ్వకూడదని వారు నిర్ణయించుకున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇదే కారణంగా గతంలో విడుదలకు సిద్ధమైన పోకిరి రీ రిలీజ్ నిలిచిపోయిందని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో స్లమ్ డాగ్ సినిమా విడుదల సమయంలో ఏం జరుగతుందోన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. సినిమా షూటింగ్ పూర్తి అయినప్పటికీ, ఫైనాన్షియల్ క్లియరెన్స్ లేకపోతే రిలీజ్ ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్. ఏదేమైనా కంటెంట్ పరంగా ఆసక్తి రేకెత్తిస్తున్న ఆ సినిమా,, విడుదల సమయంలో ఆర్థిక సమస్యలను ఎలా అధిగమిస్తుందన్నది చూడాల్సి ఉంది. ప్రేక్షకులు మాత్రం విజయ్ సేతుపతి- పూరీ జగన్నాథ్ కాంబినేషన్ పై మంచి అంచనాలు పెట్టుకున్నారు.



# చీరకట్టుతో చెమటలు పట్టిస్తున్న బేబమ్మ.. ఇంత సోయగాన్ని ఎలా మిస్ అయ్యాం?

కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు. శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశి గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ముఖ్యంగా ఈమె అందాలను చూసి ఏఐ జనరేటర్ లాగా ఉంది అని



కామెంట్లు చేస్తుంటే.. మరికొంతమంది లవ్, ఫైర్, స్మైల్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది నువ్వే నా జాన్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు తమ ప్రేమను ఒలకబోస్తూ కృతి శెట్టి ఫోటోలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృతి శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాలో నటిస్తోంది.





# విద్యార్థులకు సమంత విలువైన సలహా!

చదువు పేరుతో పిల్లలపై పాఠశాలలు, కళాశాలల ఒత్తిడి ఎక్కువవుతోందన్నది వాస్తవం. ర్యాంకుల కోసం బట్టి పట్టించే తీరు మారాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కూడా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో? పలు సూచనలు సలహాలు సైతం ప్రభుత్వాలు జారీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నటి సమంత ఈ అంశంపై మాట్లాడింది. జీవితానికి మంచి మార్కులు, గ్రేడులే ముఖ్యం కావని మానవతా విలువలు కూడా అంతే అవసరమన్నారు. చదువుతో పాటు మంచి విలువలు ఉండేలా పిల్లలకు అన్ని రకాల విద్యలు నేర్పించాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సమయం దొరకడం లేదని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. తాను విద్యార్థిగా ఉండి చాలా కాలమైందని.. కానీ ప్రస్తుతం విద్యార్థుల పడుతోన్న బాధలు, ఇబ్బందుల గురించి పత్రికల్లో , సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు చూస్తుంటే గుండె తరుక్కు పోతుందన్నారు. పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారనిపిస్తుందన్నారు. తాను స్కూల్ చదువుకుంటోన్న రోజుల్లో అలాంటివి ఏవీ లేవనిస్నేహం, దయ, సానుభూతి, ఇతరుల పట్ల గౌరవం వంటి లక్షణాలే తనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. మంచి మనిషిగా ఎలా ఉండాలో పాఠశాల నేర్పిస్తుందన్నారు. అప్పుడు నేర్చుకున్నవే జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలో సహకరిస్తాయంది. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా నిలబడే ధైర్యాన్ని కూడా పాఠశాల దశ నుంచే పిల్లలు అలవాటు చేసుకోవాలన్నారు. ఇలాంటి అంశాలతో కూడిన పాఠ్యాంశాలను జోడిస్తే బాగుంటుందన్నారు. 2023 లో దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. మహారాష్ట్రలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయని గుర్తు చేసారు. సమంత సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా ఉంటారన్న సంగతి తెలిసిందే. సొంతంగా చారిటీలను కూడా నిర్వహిస్తున్నారు. అనాధశ్రమాలు, పిల్లలను చదివించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.ప్రస్తుతం సమంత నటిగా సినిమాలు చేయని సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లకు పని చేస్తోంది. కొత్త సినిమాలకు సంబంధించి అప్ డేట్స్ త్వరలో వచ్చే అవకాశం ఉంది.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\